ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
గుంటూరు జిల్లా వార్తలు
5
శుక్రవారం 19 ఏప్రిల్ 2024







మంగళగిరిలో లోకేశ్ తరపున రెండో సెట్ నామినేషన్ పత్రాలను ఆర్వో రాజకుమారికి అందజేస్తున్న ఎన్డీఏ కూటమి నేతలు

అపూర్వ ఘట్టం

- కోలాహలంగా నారా లోకేశ్ నామినేషన్
- భారీగా తరలివచ్చిన టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు

8లో..



విలీనం.. వంచన

ఆశ.. నిరాశ

తానొకటి తలిస్తే దైవం మరొకటి తలచింది అన్నట్లుగా ఆర్టీసీ ఉద్యోగుల పరిస్థితి తయారైంది. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలన్నది కార్మికుల కల. ప్రభుత్వంలో విలీనమైతే తమకున్న కష్టాలన్నీ తీరిపోతాయని, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనాలు, ప్రయోజనాలు అందుతాయని ఆశ పడ్డారు. అందుకోసం విలీనం చేయాలని ఉద్యమాలు కూడా చేశారు. అధికారం చేపట్టిన కొద్దిరోజుల్లోనే ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తూ వైసీపీ పాలకుల నిర్ణయంతో ఉద్యోగులంతా సంబరాలు చేసుకున్నారు. ఆ సంబరాలు, వారి ఆనం దం ఎంతోకాలం నిలవలేదు. విలీనం కోరుకుని ఎంత పెద్ద తప్పు చేశారో తెలియడానికి వారికి అట్టే సమయం పట్టలేదు. విలీనం వల్ల తమకు వీసమెత్తు ప్రయోజనం కలగకపోగా, అప్పటికే ఉన్న అన్ని ప్రయోజనాలు కోల్పోయారు.

ఆర్టీసీ కార్మికులు.. విలీనంతో ఉద్యోగులయ్యారు. ప్రభుత్వంలో విలీనమైతే ఎంతో మేలు జరుగుతుంది.. తమ జీవితాలు బాగుపడతాయి.. ఆర్టీసీ కార్మికులుగా అనుభవించిన కష్టాలన్నీ దూరమవుతాయని భావించారు. అయితే మేలు కంటే కష్టాలు.. నష్టాలు ఎక్కువగా ఉండటంతో విలీనం పేరుతో తమను ప్రభుత్వం వంచించిందని వాపోతున్నారు. విలీనంతో గతంలో ఆర్టీసీ కార్మికులుగా దక్కించుకున్న కార్మిక చట్టాలు, హక్కులు, సంక్షేమ పథకాలన్నింటినీ కోల్పోయారు. సరే జీతాలన్నా ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా ఉంటున్నాయా అంటే అదీ లేదు. దీంతో ఆర్టీసీ ఉద్యోగుల పరిస్థితి పెనంమీద నుంచి పొయ్యిలోకి పడిన చందంగా మారింది. కార్మికులు తలచింది ఒకటికాగా విలీనం పేరుతో వైసీపీ ప్రభుత్వం చేసింది మరొకటి. దీంతో ఉద్యోగులుగా మారిన కార్మికులు విలవిలలాడిపోతున్నారు. విలీనం పేరుతో ప్రభుత్వం ఆడిన నాటకంలో తాము బలిపశువులుగా మారిపోయామని ఆర్టీసీ ఉద్యోగులు వాపోతున్నారు.

గుంటూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్మికులు కోరినట్లుగా ప్రభుత్వంలో విలీనం చేస్తున్నామని వైసీపీ అధినేత జగన్ ముఖ్యమంత్రి పదవి చేపట్టిన తర్వాత ప్రకటించారు. దీంతో ఆర్టీసీ కార్మికులు జగన్‌కు క్షీరాభిషేకాలు చేశారు. విలీనంతో తమ జీవితాలు బాగుపడతాయని ఆర్టీసీ కార్మికులు భావించారు. అయితే విలీనం పేరుతో ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి తమ జీవితాలతో చెలగాటమాడుతున్నారని తొలుత వారు భావించలేదు. రోడ్డు రవాణా సంస్థను ప్రభుత్వం విలీనం చేయడం వెనుక కంటికి కనపడని వంచన ఉందని ఉద్యోగులు లేటుగా తెలుసుకున్నారు. విలీనమైన తర్వాత ఒక్కో ప్రయోజనం కోల్పోవాల్సి వచ్చింది. ఒక పీఆర్సీని కోల్పోవడమే కాకుండా, పాత జీతాలతోనే సరిపుచ్చుకోవాల్సి వచ్చింది. దానికి తోడు అప్పటి వరకూ వారికి వర్తించిన కార్మిక చట్టాలు, ట్రేడ్ యూనియన్ హక్కులు, సంక్షేమ పథకాలు అన్నీ రద్దయిపోయాయి. ఆర్టీసీ ఉద్యోగులకు ప్రతి నాలుగేళ్లకు ఒకసారి వేతన సవరణ (పీఆర్సీ) అమలు జరుగుతుంది. 2017లో వారికి వేతన సవరణ జరగ్గా 2020-21లో మరోమారు సవరణ జరగాలి. అయితే విలీనంతో ఆర్టీసీ ఉద్యోగులంతా ప్రభుత్వ ఉద్యోగులుగా మారారు కాబట్టి వారికి ప్రభుత్వ ఉద్యోగుల పీఆర్సీ అమలవుతుందని చెప్పి ఆర్టీసీలో జరగాల్సిన పీఆర్సీని ఎగవేశారు. ప్రభుత్వ ఉద్యోగుల పీఆర్సీ అనగానే 19 శాతం తక్కువగా ఉన్న తమ వేతనాలు ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పెరుగుతాయని ఆశపడ్డారు. కానీ ప్రభుత్వం వారికి టోకరా ఇచ్చింది. ఉద్యోగులకు ఆర్టీసీలోని ఉద్యోగ హోదాతో సమానంగా ప్రభుత్వ ఉద్యోగుల పే స్కేలు ఇవ్వకుండా, వారికన్నా తక్కువ హోదాలో ఉండి వారితో సమానంగా వేతనం పొందే ఉద్యోగుల పే స్కేలుతో సమానం చేసింది. దీంతో తక్కువ హోదా వున్న ఉద్యోగుల జీతాలతో వారు సరిపుచ్చుకోవాల్సి వచ్చింది. ఫలితంగా ఆర్టీసీ ఉద్యోగులకు 2019 నాటి వేతనాలతోనే సరిపుచ్చుకోవాల్సి వస్తోంది.

పేరుకే ఉద్యోగులు.. సెలవులు లేవు

ఆర్టీసీ ఉద్యోగులను పేరుకే ఉద్యోగులుగా చెబుతున్న ప్రభుత్వం వారిని విధుల్లో మాత్రం కార్మికులుగానే చూస్తోంది. వారికి ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా సెలవులు ఇవ్వకుండా కంపెనీల చట్టం కింద వారికి ఐదు సెలవులే వర్తిస్తాయని సెలవులు ఎగ్గొట్టారు. అయితే ప్రభుత్వ ఉద్యోగులు అయ్యారనే నెపంతో కార్మిక చట్టాలు, సమ్మె హక్కులు వర్తించవంటూ కార్మికుల హక్కులను కాజేశారు. దీంతో వారు తమ సమస్యలపై ఆందోళన చేసే హక్కును కూడా కోల్పోవాల్సి వచ్చింది.

మేలు కంటే కష్టాలే అధికం

- హక్కులు కోల్పోయిన ఆర్టీసీ కార్మికులు
- పెనం మీద నుంచి పొయ్యిలోకి ఉద్యోగులు
- గత ప్రయోజనాలతో పాటు ఓ పీఆర్సీ నష్టం
- కార్పొరేషన్లో ఉన్న హక్కులు, స్కీములన్నీ రద్దు
- హెల్త్ స్కీము రద్దుతో తీవ్ర ఇబ్బందుల్లో కార్మికులు
- పాత జీతాలతోనే పీఆర్సీ కలరింగ్.. నేటికీ వేతన వ్యత్యాసం

పాత స్కీములన్నీ రద్దు..

ఆర్టీసీ కార్పొరేషన్‌గా ఉన్న సమయంలో ఉద్యోగులకు హెల్త్ స్కీము అమలు జరిగేది. ఈ స్కీము కింద ఎంత తీవ్రమైన అనారోగ్యం వచ్చినా ఉద్యోగులకు ఉచితంగా వైద్యం లభించేంది. దాదాపు 30 లక్షల రూపాయల వరకూ విలువైన వైద్యం కూడా ఉద్యోగులు పొందిన సందర్భాలు ఉన్నాయి. ఇప్పుడు ఉద్యోగులు ప్రతి నెలా రూ.225 చెల్లించి ఈహెచ్‌ఎస్ కార్డు తీసుకున్నా ఫలితం లేకుండా పోయింది. వైద్య పరీక్షలన్నీ సొంతంగానే చేయించుకోవాల్సి వస్తోందని ఉద్యోగులు చెబుతున్నారు. ఎస్సార్బీసీ కింద ప్రతి నెలా ఉద్యోగుల రూ.300 పొదుపు చేసుకుని దాని ద్వారా పిల్లల చదువులకు రుణాలు తీసుకునేవారు. విశ్రాంత ఉద్యోగులకు పెన్షన్ బెనిఫిట్స్ కల్పించేవారు. ఇప్పుడు ఈ పథకాన్ని కూడా ప్రభుత్వం రద్దు చేసింది. దీంతో విశ్రాంత ఉద్యోగులకు గతంలో వచ్చే పెన్షన్ కూడా దక్కకుండా పోయింది. విరమణ అనంతరం వారు ఒట్టి చేతులతోనే ఇళ్లకు పోవాల్సిన దుస్థితి నెలకొంది.



ఆందోళనలో ఉద్యోగులు

ఆర్టీసీ ఉద్యోగులకు ప్రతి నాలుగేళ్లకు ఒకసారి పీఆర్సీ ఉంటుంది. విలీనంతో ఈ పీఆర్సీ ఐదేళ్లకు పెరిగింది. పదేళ్లకు మారే అవకాశం ఉందని గతంలో ప్రభుత్వం ప్రకటించడంతో ఉద్యోగులు మరింత ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగుల కంటే డీఏ 8 శాతం వీరికి తక్కువగా ఉంది. ప్రభుత్వ వంచనతో ఉద్యోగులు అది కూడా కోల్పోయామని వాపోతున్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు 2018 జనవరి 1 నుంచి వేతన స్కేలు అమలు చేయగా, ఆర్టీసీ ఉద్యోగులకు 2022 జనవరి 1 నుంచి అమలు చేశారు. ఈ మధ్యకాలంలో కార్మికులకు రావాల్సిన డీఏలన్నీ ఇవ్వకుండా ఎగవేసిందని ఉద్యోగ సంఘాలు ఆరోపిస్తున్నాయి. ప్రభుత్వ ఉద్యోగులుగా మారిన కారణంగా గృహ అలవెన్స్(హెచ్‌ఆర్‌ఏ) 4 శాతం వరకూ తగ్గిందని ఉద్యోగులు వాపోతున్నారు. నగరాల్లో హెచ్‌ఆర్‌ఏ 16 నుంచి 12 శాతానికి, గ్రేడ్ 1 మున్సిపాలిటీల్లో 14.5 శాతం నుంచి 12 శాతానికి తగ్గిందని ఆవేదన చెందుతున్నారు. కార్పొరేషన్లో ఉండగా ప్రతి నెలా ఒకటో తేదీన వేతనాలు వచ్చేవని, పండుగ సమయాల్లో ఐదారు రోజులు ముందు గానే వేతనాలు పడేవని, ఇప్పుడవన్నీ కలగా మారిపోయాయని చెబుతున్నారు. ప్రభుత్వంలో విలీనం కాకుండా ఉంటే 2020-21 లో మరో పీఆర్సీ అమలు జరిగేదని, దానివల్ల ఇంతకంటే మెరుగైన వేతనాలు అమలు జరిగేవని చెబుతున్నారు.

ఆర్థికంగా నష్టపోయాం

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం వల్ల తీవ్రంగా నష్టపోయాం. వేతనాలు ప్రభుత్వ ఉద్యోగులతో సమానం కాకపోగా, కార్పొరేషన్ ద్వారా వచ్చే అనేక ప్రయోజనాలు కోల్పోయాం. ఈహెచ్‌ఎస్ హెల్త్‌కార్డు ఎందుకూ పనికిరావడం లేదు. విలీనం వల్ల ఘోరంగా నష్టపోయాం.

\- ఓ కార్మిక సంఘం నేత గుంటూరు

నైవేద్యం దేవుళ్లకూ..



పెనుమాక చెన్నకేశవస్వామి ఆలయం

- ఆలయాలను కరుణించని సీఆర్‌డీఏ
- కౌలు జాప్యంతో నిర్వహణ అస్తవ్యస్తం
- పస్తులుంటున్న పూజారుల కుటుంబాలు
- కౌలుతోనే మనుగడ.. పట్టించుకోని ప్రభుత్వం
- వచ్చే జూన్‌కు ఆలయాలకు కౌలు రాక రెండేళ్లు

మంగళగిరి, ఏప్రిల్ 18: రాజధాని అమరావతికి భూములిచ్చిన రైతులే కాదు.. భూములిచ్చిన పాపానికి దేవుళ్లను కూడా వైసీపీ ప్రభుత్వం శిక్షిస్తుంది. రాజధానికి భూములిచ్చిన రైతులు సకాలంలో కౌలు అందక అల్లాడుతున్నారు. కౌలు అందక అమరావతి ప్రాంతంలోని చిన్నాచితకా దేవాలయాల తాలూకు దేవుళ్లు కూడా రోజువారీ నైవేద్యానికి నోచుకోలేకపోతున్నారు. ఇక ఆ దేవాయాలపైనే ఆధారపడి జీవిస్తున్న పూజారులు కూడా జీవనానికి అల్లాడిపోతున్నారు. రాజధాని భూముల కు ఇవ్వాల్సిన కౌలు సొమ్ములను ఏపీ సీఆర్‌డీఏ చెల్లించకుండా తాత్సారం చేస్తున్నది. కౌలు సొమ్ములపైనే ఆధారపడి కొనసాగుతున్న రాజధాని అమరావతిలోని ఆలయాల మనుగడ కష్టంగా మారింది. రేపు జూన్ నాటికి సీఆర్‌డీఏ చెల్లించాల్సిన కౌలు రెండేళ్లకు చేరుతుంది.

2019 నుంచి చెల్లింపులకు బ్రేకులు

టీడీపీ హయాంలో 2016 నుంచి వరుసగా మూడేళ్లపాటు ఈ కౌలు ఆదాయాలు నిర్ణీతకాలానికి సంబంధిత రైతులు లేదా ఆలయాల తాలూకు దేవదాయశాఖ ఖాతాలకు జమవుతూ వచ్చినప్పటికీ 2019లో వైసీపీ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి కౌలు చెల్లింపులకు బ్రేకులు పడుతూ వచ్చాయి. దీంతో రైతులు ప్రతి ఏటా ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించి కౌలు కోసం సీఆర్‌డీఏపై ఒత్తిడి తేవాల్సివస్తుంది. అయితే గత ఏడాది తాలూకు కౌలు ఆదాయాలు ఇంతవరకు ఆలయాల తాలూకు ఖాతాలకు జమ కాలేదు. దీంతో రాజధాని ప్రాంతంలోని ఆలయాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. మంగళగిరి శ్రీలక్ష్మీ నృసింహస్వామి దేవస్థానానికి పుష్కలంగా ఆదాయం ఉండడంతో కౌలు ఆలస్యమైనా ఎటువంటి ఇబ్బంది లేదు. కానీ చిన్నచిన్న ఆలయాలకు ఇతరాత్ర ఆస్తులు, ఆదాయ వనరులు లేని ఆలయాల పరిస్థితి, అక్కడ పని చేసే అర్చకుల పరిస్థితి దారుణంగా ఉంది. పండుగలు, ఉత్సవాల సంగతెలా ఉన్నా.. ఆయా దేవుళ్లకు రోజువారీ నైవేద్యానికి కూడా ఇబ్బందులు పడాల్సివస్తుందని పూజారులు వాపోతున్నారు. నైవేద్యంతో పాటుగా ఆలయాల పూజారుల జీతాలు ఆలయాల నిర్వహణ చూసే దేవదాయశాఖ సిబ్బంది జీతాలు సైతం నెలలతరబడినిలిచిపోయాయి. దీంతో పూజారులు, దేవదాయశాఖ సిబ్బందితోపాటు దేవుళ్లు సైతం సీఆర్‌డీఏ చెల్లించాల్సిన కౌలుకోసం ఎదురుచూస్తున్నారు. ఎన్నికల ముందైనా ప్రభుత్వం తమపై కరుణచూపి కౌలు విడుదల చేయకపోతుందా అంటూ రాజధాని ప్రాంత రైతులతో పాటు దేవుళ్లు కూడా ఆశిస్తున్నారు.


దేవుడి భూములు 1100 ఎకరాలు



జీతాలు అందక ఆస్పత్రిలో చేరిన పెనుమాక చెన్నకేశవ స్వామి ఆలయ అర్చకుడు ప్రసాదాచార్యులు

ప్రస్తుత రాజధాని అమరావతి పరిధిలోని 29 గ్రామాల్లో తొంభైతొమ్మిది శాతం ఆలయాలు దాతలు దానంగా రాసిచ్చిన మాన్యాలపైనే ఆధారపడి కొనసాగేవి. అయితే ఈ గ్రామాల్లోని రైతులతో పాటు ఆలయాల కింద ఉన్న సుమారు 1100 ఎకరాల దేవుడి మాన్యాలను కూడా దేవదాయశాఖ భూసమీకరణ కింద సీఆర్‌డీఏకు ఇచ్చేసింది. ఇందులో ఒక్క మంగళగిరి శ్రీపానకాల లక్ష్మీ నృసింహస్వామి దేవస్థానం తాలూకు భూములే 88 ఎకరాల వరకు ఉన్నాయి. మందడం గ్రూపులోని 30 ఆలయాల కింద ఉన్న 431.17 ఎకరాలను భూసమీకరణలో భాగంగా సీఆర్‌డీఏకి ఇచ్చారు. పెనుమాకలోని చెన్నకేశవస్వామి దేవస్థానం 12.41 ఎకరాలు సీఆర్‌డీఏకి ఇచ్చింది. మంగళగిరి దేవస్థానాల కింద 32 ఎకరాలు, కాజ గ్రూపు దేవస్థానాల కింద 47 ఎకరాలు ఇచ్చారు. మిగతా ఆలయాల విషయానికొస్తే నాలుగైదు ఎకరాల వంతున ఉంటాయి. ఈ భూములకు కౌలు కింద ఏటా సాధారణ భూములకు రూ.30 వేలు, జరీబు భూములైతే రూ.50 వేల వంతున చెల్లిస్తున్నారు. ఈ కౌలును ఏటా పదిశాతం వంతున హెచ్చించి చెల్లించేలా సీఆర్‌డీఏ ఒప్పందాలు చేసుకుంది.

హామీలు.. బూటకం



కలగానే ఆటోనగర్..

పొన్నూరు పట్టణంలో దశాబ్దాలుగా ఆటోనగర్ ఏర్పాటు కలగానే మారింది. ఆటోనగర్ ఏర్పాటు చేసి వేలాది మంది కార్మికులకు ఉపాధి చూపిస్తామని ఎన్నికల సందర్భంగా జగన్ హామీ ఇచ్చారు. ఐదేళ్లుగా కార్మికులు ఎదురుచూపులతోనే సరిపెట్టుకున్నారు. ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలకు సొంత భవనాలు సమకూరుస్తామని పొన్నూరు పురపాలక సంఘంలో ఆహ్లాదం కోసం పార్కులు ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీలు ఒక్కటి కూడా నెరవేరలేదు.

- జగన్ హామీలు నీటి మూటలే
- పొన్నూరులో మారని మురికి వాడలు
- ఆటోనగర్ కోసం ఐదేళ్లుగా ఎదురుచూపు

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 18: గత ఎన్నికల్లో అధికారంలోకి రావడమే లక్ష్యంగా వైసీపీ అధినేత జగన్, పొన్నూరు అభ్యర్థి కిలారి వెంకట రోశయ్యలు హామీలను గుప్పించారు. అధికారంలోకి వచ్చాక వారు చేసిన వాగ్దానాలను, హామీలను గాలికి వదిలారు. వైసీపీ అధికారంలోకి వచ్చి ఐదేళ్లు పూర్తి అయినా పొన్నూరు ప్రజల తలరాత మారలేదు. రైతుల వెతలు తీరలేదు. మురికి వాడల అభివృద్ధి జరగలేదు. పొన్నూరు పురపాలక సంఘంలోని 22 మురికి వాడలను టీడీపీ హయాంలో పట్టించుకోలేదని తాము అధికారంలోకి వస్తే వాటిని ప్రగతి వాడలుగా మారుస్తామని 2019 ఎన్నికల ప్రచారంలో జగన్ హామీ ఇచ్చారు. ఐదేళ్లు గడిచినా ప్రగతివాడలుగా మురికివాడలు మారలేదు. 22 మురికి వాడల్లో ఒక్కదానిలో రహదారి నిర్మాణం చేయలేదు. ఒక కాల్వ కట్టలేదు.

చెప్పేదొకటి.. చేసేదొకటి...

అక్రమ మైనింగ్ జరుగుతుందని 2019కి ముందు జగన్మోహన్‌రెడ్డి స్వయంగా చేబ్రోలు మండలం సుద్దపల్లి గ్రామానికి వచ్చి ధర్నా చేశారు. తాము అధికారంలోకి వస్తే అక్రమ మైనింగ్‌కు అడ్డుకట్ట వేస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి రాగానే మైనింగ్‌కు అడ్డుకట్ట దేవుడెరుగు అక్రమ మైనింగ్‌తో వైసీపీ నేతలే చెలరేగి పోయారు. చేబ్రోలు, వడ్లమూడి, శేకూరు, వీరనాయకునిపాలెం గ్రామాల్లో వైసీపీ నేతల అక్రమ మైనింగ్ నేటికి కొనసాగుతోంది. ఉద్యాన పంటలకు నెలవైన ఈ గ్రామాలు నేడు అక్రమ మైనింగ్ దాటికి దుమ్ము కొట్టుకుపోయాయి. ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ఇటీవల ఈ గ్రామాల్లో పర్యటించి 700 ఎకరాల్లో ఐదేళ్లలో రూ.2100 కోట్లు అక్రమ మైనింగ్ ద్వారా వైసీపీ నాయకులు, ప్రజా ప్రతినిధి కిలారి రోశయ్య దోచుకున్నారని చార్జ్‌షీట్‌ను దాఖలు చేశారు. కోర్టులు పలు మార్లు హెచ్చరిస్తున్నప్పటికీ సంబంధిత మైనింగ్, రెవెన్యూ అధికారులు ఆవైపు కన్నెతి చూడటానికి కూడా సాహసించడం లేదు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్, హైకోర్టులో కేసులతో రాత్రివేళల్లో మైనింగ్ చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

గ్రామాలో తాగు, సాగు నీటి ఎద్దడి..

అధికారంలోకి వస్తే గ్రామాల్లో తాగు, సాగు నీటి సమస్యను పరిష్కరిస్తామని జగన్ హామీ ఇచ్చారు. ఎన్నికల ముందు జగన్ పొన్నూరు బహిరంగ సభలో ప్రతిగ్రామానికి వైఎస్సార్ సుజల స్రవంతి పేరుతో రక్షిత మంచినీరు సరఫరా చేస్తామని ఇచ్చిన హామీ నేటికి నేరవేరలేదు. సరికదా, ఎన్టీఆర్ సుజల పథకం పేరు మార్చి నిర్మాణాన్ని పూర్తి చేయకుండా వదిలివేశారు. కాల్వల ఆధునికీకరణ గ్రామాల్లో రక్షిత మంచినీటి పథకాలను ఏర్పాటుపై జగన్ ఇచ్చిన హామీ నెరవేర్చలేదు. పొన్నూరు మండలం శ్రీరంగపురం ఛానల్, పొన్నూరు ఛానల్, అలవల ఛానల్ అధ్వానంగా మారాయి. తుంగభద్ర డ్రెయిన్‌పై చెక్‌డ్యామ్ నిర్మించి వృథాగా సముద్రంలోకి పోతున్న నీటిని పొలాలకు మళ్లించాలని టీడీపీ ప్రభుత్వంలో రూపొందించిన పథకాన్ని సైతం వైసీపీ పాలకులు అడ్డుకున్నారు. తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో రూ.50 కోట్ల వ్యయంతో ఐదు లిఫ్ట్‌ఇరిగేషన్ పథకాలు నిర్మిస్తే వాటిని కూడా నిలిపివేయించిన ఘనత వైసీపీ పాలకులది. అప్పాపురం ఛానల్, కొమ్మమూరు కెనాల్ ఆధునికీకరణను పాలకులు పూర్తిగా విస్మరించారు. 300 కోట్లతో గుంటూరు ఛానల్ ఆధునికీకరించి రివిట్‌మెంట్ ఏర్పాటు చేస్తామని, కాల్వను పొడిగిస్తామని జగన్ ఇచ్చిన హామీ నేటికి కార్యరూపం దాల్చలేదు. నల్లా డ్రెయిన్ ఆధునికీకరణను ఆపివేశారు. నంబూరు గ్రామ శివారు డ్రెయిన్ ఆధునికీకరించకపోవటంతో పంటలు ఎండిపోయే పరిస్థితులు నెలకొన్నాయి. వెనిగండ్ల ఎత్తిపోతల పథక నిర్మాణం ఉత్తుత్తి హామీగా మిగిలిపోయింది.



తూటి కాడ, గుర్రపు డెక్కతో నిండిపోయిన అలవల ఛానల్

నామినేషన్ల ఘట్టం ప్రారంభం

- లోక్‌సభకి ఐదు, అసెంబ్లీ స్థానాలకు 14 దాఖలు

గుంటూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా సాధారణ ఎన్నికల నామినేషన్ల ఘట్టం గురువారం ప్రారంభమైంది. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం గురువారం గుంటూరు లోక్‌సభతో పాటు మంగళగిరి, తాడికొండ, గుంటూరు తూర్పు, పశ్చిమ,పొన్నూరు, ప్రత్తిపాడు, తెనాలి అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు వారి కార్యాలయాల్లో నోటిఫికేషన్లను విడుదల చేశారు. గుంటూరు లోక్‌సభ స్థానానికి తొలి రోజున ఐదు నామినేషన్లు దాఖల య్యాయి. ప్రధాన పార్టీలైన టీడీపీ, వైసీపీ, కాంగ్రెస్‌ల నుంచి ఎవరూ నామినేషన్లు వేయలేదు. తొలి నామినేషన్‌ని పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థి అంబటి చలమయ్య దాఖలు చేశారు. ఆ తర్వాత ఇండిపెండెంట్లు దండేం రత్నం, గాయత్రి ఆదిపూడి, అక్కిశెట్టి శ్రీకృష్ణ, షేక్ అస్లాం అక్తర్ దాఖలు చేశారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారి వేణుగోపాల్ రెడ్డి అభ్యర్థుల నుంచి నామినేషన్లను స్వీకరించారు. కలెక్టరేట్‌లోనే గోదావరి బ్యాంకు, ట్రెజరీల్లో పనుల కోసం వచ్చిన వారిని మధ్యాహ్నం 3 గంటల వరకు బయటే నిలిపేశారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో తొలి రోజున 14 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ఇందులో 10 మంది మంగళగిరిలోనే నామినేషన్లు వేశారు. తాడికొండలో పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా తరఫున తాళ్లూరి నాగరాజు, మంగళగిరిలో రావు సుబ్రహ్మణ్యం(నవతరం పార్టీ) రెండు నామినేషన్లు, షేక్ జలీల్(నవరంగ్ కాంగ్రెస్), దానబోయి న వెంకట శివాజీ(ఇండిపెండెంట్) మూడు నామినే షన్లు, రామచంద్రరరావు బోదె (ఇండిపెండెంట్), నైనాల లావణ్య(ఇండిపెండెంట్), లోకేశ్ నారా(టీడీపీ) రెండు సెట్లు, జడ శ్రావణ్‌కుమార్(జై భీంరావు భారత్ పార్టీ), బంజనం కోటేశ్వరరావు(తెలుగు రాజ్యాధికార సమితి పార్టీ), పద్మ (ఇండిపెండెంట్)గా నామినేషన్లు వేశారు. ప్రత్తిపాడులో స్తోత్ర రాణి (భారత్ చైతన్య యువజన పార్టీ), గుంటూరు పశ్చిమలో సురేష్ కోటపాటి(పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా), గుం టూరు తూర్పులో కాజా వెంకట రాఘవేంద్ర సంజీ వరావు(పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా) నామినేషన్లు వేశారు.

కూటమితోనే అమరావతి కల సాకారం

- కూటమితో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు స్వర్ణయుగం
- నరసరావుపేట ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు
- పేదలకు రెండు సెంట్ల స్థలం : జీవీ ఆంజనేయులు
- గ్రామాల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం



కారుమంచిలో మాట్లాడుతున్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు

శావల్యాపురం, ఏప్రిల్ 18: ఆంధ్రుల ఏకైక రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్టులను టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి కూటమి అధికారంలోకి రాగానే పూర్తిచేసి ఐదేళ్లలో ప్రజల కలల్ని సాకారం చేస్తామని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. శావల్యాపురం మండలంలోని గుంటుపాలెం, వయ్యకల్లు, కారుమంచి గ్రామాల్లో బుధవారం రాత్రి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ప్రచారానికి వెళ్ళిన ఎంపీ లావు, మాజీ ఎమ్మెల్యేలు జీవీ, మక్కెనలకు మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు బ్రహ్మరథం పట్టారు. మహిళలు ఎదురెళ్ళి నేతలకు హారతులిచ్చి సాదరంగా గ్రామాల్లోకి ఆహ్వానించారు. కారుమంచి ఎన్టీఆర్ కూడలిలో టీడీపీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి మొత్తం రాజధానితో ముడిపడి ఉందని, అమరావతిని అభివృద్ధి చేసి పరిశ్రమలు తీసుకొచ్చి యువతకు ఉద్యోగావకాశాలు కల్పించగల సత్తా చంద్రబాబుకు మాత్రమే ఉందన్నారు. కూటమి అధికారంలోకి రాగానే గత ఐదేళ్ళుగా నిలిచిపోయిన ఎత్తిపోతల పథకం, పల్నాడు వాటర్‌గ్రిడ్‌లను పునఃప్రారంభించి గోదావరి జలాలతో రైతులకు రెండు పంటలకు సాగునీరు, ఇంటింటికీ కొళాయిలు వేసి ప్రజలందరికీ తాగునీరు అందిస్తామన్నారు. కూటమితో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు స్వర్ణయుగం రానుందని, 50 ఏళ్ళు నిండినవారికి రూ.4 వేలు ఫించన్‌లు అందించనున్నామని, అన్ని వర్గాలకు కార్పొరేషన్‌లు పెట్టి రాయితీలపై రుణాలిచ్చి వారిని ఆదుకొంటామన్నారు. కారుమంచి వద్ద ఏబీసీ కెనాల్‌పై శిథిలావస్థలోనున్న బ్రిడ్జిని పునర్ నిర్మాణం చేయిస్తామని హామీనిచ్చారు. మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ వినుకొండ నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసి ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని, వినుకొండ ఎస్ఎస్‌పీ కాలనీలో పార్కు, స్టేడియం నిర్మాణాలు, కొండపైకి వెళ్ళే ఘాట్‌రోడ్డుకు తారురోడ్డు నిర్మిస్తామని, భక్తుల సహకారంతో రామలింగేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ చేయిస్తానన్నారు. కూటమి అధికారంలోకి రాగానే ఎన్టీఆర్ కాలనీలు వేసి పేదలందరికీ రెండుసెంట్లు చొప్పున స్థలాలిచ్చి ఇళ్ళు కట్టిస్తామని, ఇంటి బిల్లులు రానివారందరికీ బిల్లులు ఇప్పిస్తామన్నారు. ఎమ్మెల్యేగా బొల్లా చేసిన అక్రమాలపై బట్టబయలు చేసి ఆయన్ని జైలుకు పంపడం ఖాయమన్నారు. మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లిఖార్జునరావు మాట్లాడుతూ వినుకొండకు పదిమంది ఎమ్మెల్యేలుగా చేసినా బొల్లా మాత్రమే అభివృద్ధి చేసినట్లుగా గొప్పలు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఎమ్మెల్యేగా ప్రజలకు ఆదర్శంగా ఉండాల్సిన బొల్లా ప్రెస్‌మీట్లలోనే వినలేనిబూతులు మాట్లాడి బూతుల ఎమ్మెల్యేగా మారాడని, రానున్న ఎన్నికల్లో ప్రజలంతా బొల్లాకు బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. అనంతరం కారుమంచిలో వైసీపీ నుంచి టీడీపీలో చేరిన 30కుటుంబాల వారికి నేతలు పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీ మండల అధ్యక్షులు గుంటూరు సాంబశివరావు, జనసేన మండల అధ్యక్షులు అడపాల అనిల్‌కుమార్, నాయకులు యరమాసు కోటేశ్వరరావు, గడిపూడి విశ్వనాథం, గోనుగుంట్ల వెంకట్రావు, కోట హరిబాబు పాల్గొన్నారు.



కూటమి అభ్యర్థులకు హారతులిస్తున్న మహిళలు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు జీవీ, మక్కెన

అరాచక పాలనకు చరమగీతం పాడాలి

- గుంటూరు పార్లమెంట్ కూటమి అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని
- తెనాలి కూటమి అభ్యర్థి నాదెండ్ల మనోహర్, మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌లతో కలసి ఎన్నికల ప్రచారం
- రోడ్‌షోకు బ్రహ్మరథం పట్టిన ప్రజలు



రోడ్‌షోలో మాట్లాడుతున్న పెమ్మసాని చంద్రశేఖర్, పక్కన మనోహర్, ఆలపాటి

కొల్లిపర, ఏప్రిల్ 18: రాష్ట్రంలో రాక్షస పాలనకు చరమగీతం పాడాలని గుంటూరు పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ధ్వజమెత్తారు. గురువారం మండల కేంద్రం కొల్లిపరలో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి పార్టీల అభ్యర్థి నాదెండ్ల మనోహర్, పెమ్మసాని చంద్రశేఖర్, మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. స్థానిక వీరభద్రస్వామి కాలనీ నుంచి బయలు దేరిన ర్యాలీ గ్రామ పురవీధుల్లో కొనసాగింది. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా రోడ్‌షోలో చంద్రశేఖర్ మాట్లాడుతూ రాష్ట్రంలో అవినీతి, దోపిడి పాలన కొనసాగుతోందన్నారు. కృష్ణానదిలో ఇసుక తవ్వకాలు జరిపి భారీ వాహనాల ద్వారా తరలిస్తున్నారని దీంతో రోడ్లుకూడా గుంతలమయింగా మారినట్లు తెలిపారు. నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ గతంలో తాను శాసనసభ్యునిగా పని చేసినప్పుడు తెనాలి నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో నడిపించానన్నారు. అరాచపాలన నుంచి రాష్ట్రం విముక్తి చెందాలంటే టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి పోటీ చేస్తున్న అభ్యర్థులను అత్యంత మెజార్టీతో గెలిపించాల్సిన అవసరం నేడు ఎంతైన ఉందని మనోహర్ స్పష్టం చేశారు.

మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ పెమ్మసాని చంద్రశేఖర్‌కు సైకిల్ గుర్తుపై ఓటు వేసి, తెనాలి అభ్యర్థిగా పోటీ చేస్తున్న నాదెండ్ల మనోహర్‌కు గ్లాసు గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాల్సిన బాధ్యత మీ అందరిపై ఉందన్నారు. అనంతరం కొద్దిమంది టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. రోడ్‌షోలో జడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టీనా, టీడీపీ మండల అధ్యక్షుడు భీమవరపు చినకోటిరెడ్డి, జనసేన మండల అధ్యక్షుడు యర్రు వెంకయ్యానాయుడు, టీడీపీ తెలుగురైతు కార్యనిర్వహక కార్యదర్శి వంగా సాంబిరెడ్డి, టీడీపీ జిల్లా కార్యదర్శి కంచర్ల అమృతరాజు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు గుదిబండి గోవర్ధనరెడ్డి, భీమవరపు లంకకోటిరెడ్డి, కట్టా శ్రీహరిరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



అభ్యర్థులకు ఘనస్వాగతం పలుకుతున్న గ్రామస్థులు

టీడీపీ ఉమ్మడి అభ్యర్థులను గెలిపించండి
- పెమ్మసాని సతీమణి డాక్టర్ శ్రీరత్న

మేడికొండూరు: రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే తెలుగుదేశం మిత్రపక్షాల అభ్యర్థులను గెలిపించాలని గుంటూరు పార్లమెంట్ నియోజక వర్గ టీడీపీ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ సతీమణి డాక్టర్ శ్రీరత్న విజ్ఞప్తి చేశారు. గుంటూరు రూరల్ మండలం, చల్లావారిపాలెంలోని అపార్ట్‌మెంట్‌లలో డాక్టర్ శ్రీరత్న గురువారం ఎన్నికల ప్రచారం చేశారు. గుంటూరు పార్లమెంట్ నియోజక వర్గంలో ఎంపీగా తన భర్త డాక్టర్ చంద్రశేఖర్‌ను, ప్రత్తిపాడు నియోజకవర్గ అభ్యర్థి రామాంజనేయులును గెలిపించాలని కోరారు. డాక్టర్ శ్రీరత్నకు మహిళలు హారతులిచ్చి ఆహ్వానించారు. కార్యక్రమంలో రావిపాటి మోహనరావు, చింతా అనూష, స్వర్ణ బాబు, జనసేన నేతలు సూరిశెట్టి హరీష్, సూదా పిచ్చయ్య, బీజేపీ నేతలు సురేష్ తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ శ్రీరత్నకు స్వాగతం పలుకుతున్న చల్లావారిపాలెం వాసులు

వ్యవసాయానికి విద్యుత్ మీటర్లు

- వైసీపీ స్టిక్కర్లు తొలగించి మీటర్లు బిగింపు



వీరాపురంలో రైతు పొలంలో అమర్చిన విద్యుత్ మీటర్

పిడుగురాళ్ల, ఏప్రిల్ 18: పల్నాడుజిల్లా పిడుగురాళ్ల మండలం వీరాపురంలో రెండు రోజులుగా వ్యవసాయ బోర్ల వద్ద ప్రభుత్వం విద్యుత్ మీటర్లను అమర్చుతుంది. మీటర్లు వద్దు బాబోయ్.. అంటూ రైతులు మొత్తుకుంటున్నా వినకుండా వ్యవసాయశాఖ ఆ పనిలో నిమగ్నమైంది. సాగుకి మీటరు వద్దన్న వారికి ఇంటి కనెక్షన్‌ను తొలగించి వేస్తామంటూ అధికారులు బెదిరింపులకు పాల్పడుతున్నట్లు పలువురు రైతులు ఆరోపిస్తున్నారు.

కౌలు రైతు ఆత్మహత్య



పులి వెంకటేశ్వర్లు (ఫైల్)

చుండూరు ఏప్రిల్ 18 : అప్పుల బాధ తట్టుకోలేక కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన బాపట్లజిల్లా చుండూరు మండలం మోదుకూరులో గురువారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన పులి వెంకటేశ్వర్లు (55) సొంత భూమి లేకపోవడంతో ఈ ఏడాది 10, అందకు ముందు 5 ఎకరాలు కౌలుకి సాగుచేశాడు. కొద్ది సంవత్సరాలుగా సరైన దిగుబడులు లేక, గిట్టుబాటు ధరలు లేక తుఫాన్ ప్రభావంతో వెంకటేశ్వర్లు రూ.10-15 లక్షల మేరా అప్పుల పాలయ్యాడు. కౌలు డబ్బుల కోసం ఒత్తిడి పెరిగిపోవడంతో తీర్చేమార్గం లేక అవమాన భారంతో బుధవారం పురుగు మందుతాగాడు. ఇది గుర్తించిన కుటుంబ సభ్యులు వెంటనే గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

ఆర్‌ఎంపీ, పీఎంపీల సమస్యలు పరిష్కరిస్తాం

- చిలకలూరిపేట కూటమి అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు



ఆర్‌ఎంపీ, పీఎంపీల సమావేశంలో మాట్లాడుతున్న పత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, ఏప్రిల్ 18: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆర్‌ఎంపీ, పీఎంపీల సమస్యలు పరిష్కరిస్తామని మాజీమంత్రి, టీడీపీ ఉమ్మడి అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు స్పష్టం చేశారు. పవిత్రమైన వృత్తిలో ఉంటూ గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్యమిత్రలుగా నిలుస్తున్న వారిని కాపాడుకొని ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గురువారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన ఆర్‌ఎంపీ, పీఎంపీల ఆత్మీయ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రత్తిపాటి మాట్లాడుతూ ఇప్పటికే పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ కూడా వారికి మెరుగైన శిక్షణ, గుర్తింపు కార్డులు అందిస్తామని చెప్పారని గుర్తు చేశారు. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తరువాత వంద రోజుల్లో ఆ హామీ అమలు చేస్తామని, కూటమి విజయంకోసం ఆర్‌ఎంపీలు, పీఎంపీలు కృషి చేయాలని ప్రత్తిపాటి పిలుపు నిచ్చారు. నియోజక వర్గాన్ని తాను అభివృద్ధి చేసినట్లుగా ఎవ్వరూ అభివృద్ధి చేయలేదని, ఒక్క ఛాన్స్ అన్న మాట విని విడదల రజినికి అవకాశం ఇస్తే ఐదు సంవత్సరాలు నియోజక వర్గాన్ని పట్టించు కోలేదని, దోచుకొని పారిపోయారని మండి పడ్డారు. నాసిరకం మద్యంతో ఏడాదికి రూ.30వేల కోట్ల చొప్పున ఐదు సంవత్సరాల్లో రూ.1.50 లక్షల కోట్లు దోచేశాడని, ఈ మద్యం వల్ల ప్రజల కాలేయం, కోమగ్రంధి దెబ్బతిని ఆస్పత్రుల పాలయ్యే వారి సంఖ్య పెరుగుతుందని, అందులో సమిధలుగా మారుతుంది బడుగు, బలహీన వర్గాల నిరు పేదలేనని ప్రత్తిపాటి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఏడాదిలో నాలుగైదు సార్లు బటన్‌లు నొక్కాడని, కాని ఎవ్వరికీ ఖాతాలో ఇప్పటి వరకు డబ్బు పడ లేదన్నారు. ఈ మోసగాడి ప్రభుత్వాన్ని ఇంటికి పంపించటానికి మీరంతా కంకణం కట్టుకోవాలని, సైకిల్ గుర్తుపై ఓట్లు వేయించి తెలుగుదేశం కూటమి అభ్యర్థులను శాసన సభకు నన్ను, పార్లమెంట్‌కు శ్రీ కృష్ణ దేవరాయలను అధిక మెజార్టీతో గెలిపించాలని ప్రత్తిపాటి కోరారు.

భానుడి భగభగ.. జనం విలవిల..

గుంటూరు(విద్య)ఏప్రిల్ 18: భానుడి భగభగలతో గురువారం గుంటూరు జిల్లా వ్యాప్తంగా ప్రజలు అల్లాడారు. వేసవి తీవ్రత ప్రారంభమైన మొదటి వారంలోనే ఎండ తీవ్ర పెరగడం ఇదే ప్రథమం. ఉదయం 11 గంటలకే నగరంలోని అనేక ప్రాంతాల్లో వీధులు ఖాళీ అయ్యాయి. వడగాల్పులు అధికంగా వీయడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. దీంతో చెట్ల నీడలను, శీతల పానీయాలను ఆశ్రయించారు. కొన్ని ప్రాంతాల్లో మరమ్మతుల పేరుతో విద్యుత్ సరఫరాను నిలిపివేయడంతో అక్కడి ప్రజలు ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు వేసవి తాపానికి ఇళ్లలోనే ఉడికి పోయారు.



పరదాలతో ప్రయాణం..



ఏసీబీ వలలో సీఆర్‌డీఏ అధికారులు



ఏసీబీకి చిక్కిన సీఆర్డీఏ అధికారులు చంద్రశేఖర్‌రావు, రాజేంద్రసాయినాథ్

- బిల్డింగ్ అప్రూవల్ కోసం రూ.30వేల లంచం డిమాండ్
- పట్టుబడిన జూనియర్ ప్లానింగ్ ఆఫీసర్, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్

తెనాలి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): బిల్డింగ్ ప్లాన్ అప్రూవల్ కోసం లంచం డిమాండ్ చేసిన ఇద్దరు సీఆర్‌డీఏ అధికారులను గుంటూరు రేంజి ఏసీబీ అధికారులు వలపన్ని పట్టుకున్నారు. ఏసీబీ అదనపు ఎస్పీ మహేంద్ర మత్తే తెలిపిన వివరాల ప్రకారం... చేబ్రోలు మండలం వడ్లమూడికి చెందిన రత్నబాబు అనే వ్యక్తి తన బంధువు ఇంటి నిర్మాణానికి సంబంధించి బిల్డింగ్ ప్లాన్ అప్రూవల్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు. తెనాలి ఉడా కాలనీలో ఉన్న సీఆర్‌డీఏ జోనల్ కార్యాలయానికి ఎంత తిరిగినా పని కాకపోవటంతో అధికారులను వేడుకుంటే రూ.30వేలు లంచం డిమాండ్ చేశారని తెలిపారు. అన్ని అర్హతలున్నా లంచం డిమాండ్ చేయటం, రోజుల తరబడి తిప్పుతుండటంతో విసిగిపోయిన రత్నబాబు ఏసీబీని ఆశ్రయించారు. ఏసీబీ డీజీ రాజేంద్రనాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు గుంటూరు రేంజి ఏసీబీ అధికారుల బృందం గురువారం తెనాలిలోని సీఆర్‌డీఏ జోనల్ కార్యాలయంలో నిఘా వేశారు. రత్నబాబు తరఫున వెళ్లిన ఒక ప్రైవేట్ ప్లానింగ్ చూసే వ్యక్తి నుంచి రూ.30వేలు లంచం తీసుకుంటుండగా ఇరువురు అధికారులను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్టు అదనపు ఎస్పీ తెలిపారు. కార్యాలయంలో జూనియర్ ప్లానింగ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న లేళ్ల చంద్రశేఖరరావు, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ ఘంటా రాజేంద్రసాయినాద్‌లను పట్టుకున్నట్టు చెప్పారు. దాడిలో ఏఎస్పీ మహేంద్ర మత్తేతో పాటు డీఎస్పీలు సత్యానంద్, ప్రతాప్‌కుమార్, మరో ఆరుగురు ఇన్‌స్పెక్టర్‌లు పాల్గొన్నారు.

ఉద్దండ్రాయునిపాలెం ఘటనపై ఫిర్యాదు

- విచారణకు నలుగురు అధికారులతో కమిటీ

తుళ్ళూరు, ఏప్రిల్ 18: ఉద్దండ్రాయుపాలెం రాజధాని శంకుస్థాపన ప్రదేశంలో ఏర్పాటు చేసిన మ్యూజియంలో గుర్తు తెలియని వ్యక్తులు నమూనాలు ధ్వంసం చేసిన ఘటనపై ఏపీ సీఆర్డీఏ కమీషనర్ వివేక్ యాదవ్ నలుగురు సభ్యులతో కూడిన అధికారుల కమిటీని నియమించారు. కమిటీ బృందం గురువారం ఘటనా స్థలాన్ని పరిశీలించింది గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసిన నమూనాలు పాక్షికంగా దెబ్బతిన్నట్టు గుర్తించారు. ఈ ఘటనపై కమిటీ బృందం తుళ్లూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇందుకు కారకులైన వ్యక్తులను వెంటనే గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులు పోలీసులను కోరారని సీఆర్డీఏ కార్యాలయం గురువారం జారీ చేసిన ఒక ప్రకటలో పేర్కొంది.

సెక్యూరిటీని తీసేసి..

గత టీడీపీ ప్రభుత్వం రాజధాని నమూనా ఆర్ట్ గ్యాలరీ సంరక్షణకు పోలీస్ సెక్యూరిటీని ఏర్పాటు చేసింది. అప్పట్లో సందర్శకులు ప్రధాని శంకుస్థాపన చేసిన ప్రదేశాన్ని చూడటానికి పోటెత్తారు. పవిత్రమైన మట్టి నీరు. ఆర్ట్ గ్యాలరీ, శంకుస్థాపన శిలాఫలకాన్ని రక్షించటానికి సెక్యూరిటీని పెట్టారు. వైసీపీ వచ్చిన ఒక సంవత్సరం కాపలా ఉంది. సందర్శకులు రావటానికి రోడ్లన్ని ఇసుక మాఫియా ధ్వంసం చేసింది. కాలక్రమంలో పోలీస్ సెక్యూరిటీని ఎత్తేశారు. భద్రత లేకపోవటంతో అసాంఘిక శక్తులు శంకుస్థాపన ప్రదేశంలో విచ్చలవిడిగా వ్యవహారాలు సాగిస్తున్నాయి. గత కొంత కాలం నుంచచి అరాచక శక్తులు శంకుస్థాపన ప్రదేశాన్ని ధ్వంసం చేసున్నా సీఆర్డీఏ పట్టించుకోక పోవటం గమనార్హం. ఘటన వెలుగులోకి వచ్చాక చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేయటం విచిత్రంగా ఉందని భూములిచ్చిన రైతులు అంటున్నారు.

ఈ నెల 30, మే 6న పలు రైళ్ల రద్దు

గుంటూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ బ్లాక్ కారణంగా ఈ నెల 30, మే 6వ తేదీన పలు రైళ్లను రద్దు చేస్తున్నట్లు డీఆర్‌ఎం ఎం రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 30న నెంబరు. 07779 గుంటూరు మాచర్ల, 07780 మాచర్ల - గుంటూరు, 07580 మాచర్ల - నడికుడి, 07579 నడికుడి - మాచర్ల, నెంబరు. 17646 రేపల్లె - సికింద్రాబాద్, 17645 సికింద్రాబాద్ - రేపల్లె రైళ్లను పూర్తిగా రద్దు చేస్తున్నామన్నారు.

మే 6వ తేదీన నెంబరు. 07791 కాచీగూడ - నడికుడి, 07792 నడికుడి - కాచీగూడ రైళ్లను రద్దు చేస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 30న నెంబరు. 12806 లింగంపల్లి - విశాఖపట్టణం జన్మభూమి ఎక్స్‌ప్రెస్ నడికుడి మార్గంలో కాకుండా వరంగల్, కాజీపేట మీదగా విజయవాడకు మళ్లించడం జరుగు తుందన్నారు. మే 6వ తేదీన నెంబరు. 17646 రేపల్లె - సికింద్రాబాద్ రైలు 60 నిమిషాల ఆలస్యంగా రీషెడ్యూల్ చేయడం జరుగుతుందన్నారు.

పశ్చిమ డెల్టాకు 916 క్యూసెక్కులు

దుగ్గిరాల, ఏప్రిల్ 18: కృష్ణాపశ్చిమ డెల్టాకు 916 క్యూసెక్కుల నీటిని గురువారం విడుదల చేశారు. ప్రకాశం బ్యారేజివద్ద 6.4 అడుగులు నీటి మట్టం ఉంది. దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి రేపల్లెకాల్వ 394 క్యూసెక్కుల నీరు, నిజాంపట్నం కాల్వకు 265 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణే ధ్యేయం

- టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్
- జిల్లా నేతల సమక్షంలో బాధ్యతలు స్వీకారం



బాధ్యతలు స్వీకరించిన అనంతరం కొమ్మాలపాటి శ్రీధర్‌ను అభినందిస్తున్న పెదకూరపాడు కూటమి అభ్యర్థి భాష్యం ప్రవీణ్ తదితరులు

నరసరావుపేటటౌన్, ఏప్రిల్ 18: రాష్ట్రంలో వైసీపీ రాక్షస పాలనను అంతం చేయడానికే కూటమి ఏర్పడిందని, ప్రజాస్వామ్యం పరిరక్షణే కూటమి ప్రధాన ధ్యేయం అని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. గురువారం నరసరావుపేటలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడిగా కొమ్మాలపాటి శ్రీధర్ బాధ్యతలు స్వీకరించారు. శ్రీధర్‌కు వేద పండితులు ఆశీర్వాదాలు అందజేశారు. అదేవిధంగా వినుకొండ మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, పెదకూరపాడు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి భాష్యం ప్రవీణ్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు వెన్నా సాంబశివారెడ్డి, నాదెండ్ల బ్రహ్మం చౌదరి, అబ్బూరి శివనాగ మల్లేశ్వరరావు, డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు, అట్లా చినవెంకటరెడ్డి.. కొమ్మాలపాటి శ్రీధర్‌ను ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కొమ్మాలపాటి మాట్లాడుతూ జిల్లా అధ్యక్షుడుగా చంద్రబాబు తనను నియమించడం తన అదృష్టం అన్నారు. పార్టీకి చేసిన సేవలకు తగిన గుర్తింపు రావడం సంతోషంగా ఉందన్నారు. అమరావతి పునఃనిర్మాణం జరగాలంటే కూటమి గెలవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్టా కిరణ్, గొట్టిపాటి జనార్థన్‌బాబు, కరిముల్లా, సదాశివ రావు, రాపర్ల జగ్గారావు, వివిధ అనుబంధ సంఘాల అధ్యక్షులు కుమ్మెత కోటిరెడ్డి, కూరపాటి హనుమంతురావు, దాసరి ఉదయశ్రీ, కోసూరి రాధిక, గుర్రం నాగపూర్ణచంద్రరావు, నాగ సుధీర్, గంగిరెడ్డి శ్రీనివాసరెడ్డి, పాల్గొన్నారు.

అమరావతి శంకుస్థాపన ప్రదేశాన్ని అపవిత్రం చేశారు

- రాష్ట్ర ఏకైక రాజధాని అమరావతే
- 1584వ రోజుకు రైతుల ఆందోళనలు



వెంకటపాలెం శిబిరంలో మహిళలు, రైతుల ఆందోళన

తుళ్లూరు, ఏప్రిల్ 18: సాక్షాత్తు ప్రధాని మంత్రి మోదీ వేద మంత్రోచ్ఛరణల నడుమ రాజధాని అమరావతికి శంకుస్థాపన చేసిన ఉద్దండ్రాయునిపాలెం ప్రదేశాన్ని వైసీపీ ప్రభుత్వం అపవిత్రం చేసిందని రాజధాని ప్రాంత రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ ధర్నా శిబిరాలు, ఇళ్ల వద్ద నుంచి రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న నిరసన దీక్షలు, ఆందోళనలు గురువారం నాటికి 1584వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ, ఏ రాష్ట్రానికి మూడు రాజధానులుండి అభివృద్ధి చెందిందో సీఎం జగన్‌రెడ్డి చెప్పాలని డిమాండ్ చేశారు. కేవలం అమరావతిని చంపేయటానికే మూడు ముక్కలాట పెట్టారన్నారు. రాష్ట్ర ఏకైక రాజధాని అమరావతేనని స్పష్టం చేశారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది.

83,908 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 88,176 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 83,908 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 68,946 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	8000	17500
నెంబరు. 5	9000	16200
273	11500	12200
341	8000	16500
4884	11000	15000
సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	19300
బ్యాడిగి	8500	16000
దేవనూరు డీలక్స్	9000	15500
తెల్లకాయలు	5000	11000

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.15
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	132, 141, 152
చికెన్ విత్ స్కిన్	252.00
చికెన్ స్కిన్ లెస్	262.00

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

వైసీపీ పాలనలో నష్టపోయిన వ్యాపారులకు అండగా ఉంటాం

● తూర్పు నియోజకవర్గ అభ్యర్థి మొహమ్మద్ నసీర్



ప్రచారంలో పాల్గొన్న నసీర్, రావి వెంకట రమణ, గౌస్

గుంటూరు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో నష్టపోయిన వ్యాపారులకు అండగా ఉంటామని టీడీపీ గుంటూరు తూర్పు నియోజకవర్గ అభ్యర్థి మొహమ్మద్ నసీర్ అన్నారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో కొల్లి శారద కూరగాయల మార్కెట్లో ఆయన గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జనసేన నగర అధ్యక్షుడు నేరెళ్ల సురేష్, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటరమణ, మాజీ డిప్యూటీ మేయర్ గౌస్ పాల్గొని మార్కెట్లోని ప్రతి షాపునకు వెళ్లి కరపత్రాలు పంచుతూ వ్యాపారులు, రైతు కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నసీర్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో వ్యాపారులు రైతు కూలీలు అనేక ఇబ్బందులు పడ్డారని వారిని గత ఐదేళ్లుగా ఈ ప్రభుత్వం పట్టించుకోక గాలికి వదిలేసారన్నారు. వచ్చే ఎన్నికల్లో తనను, పెమ్మసానిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు జ్యోతుల జస్వంత్, జాగర్లమూడి శ్రీనివాసరావు, మార్కెట్ ప్రెసిడెంట్ సత్యనారాయణ రావు, సీతారామయ్య, షరీఫ్, ఎర్రం శెట్టి సూరి, కట్ట గోపి, చెట్టి పెద్ద మస్తాన్, బి.ప్రసాద్, శివశంకర్, శ్రీనునాయిక్, వై రామారావు పాల్గొన్నారు.

తూర్పు నియోజకవర్గం 12వ వార్డులోని వైసీపీ ముఖ్య నేతలు షేక్ అన్సారి, ఒబిడ్, ఇలియాస్, బాషా, ఆలీ, హలీం బేగ్, రియాజ్, సయ్యద్ జానీ, మస్తాన్, అజీజ్ లతోపాటు 200 కుటుంబాలు నసీర్ సమక్షంలో టీడీపీలో చేరారు.

నూతన భవన సముదాయానికి రూ.6 లక్షల విరాళం

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 18 : కమ్మ జన సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక జేకేసీ కాలేజి రోడ్డులో నూతనంగా నిర్మిస్తున్న బాలికల వసతి గృహానికి ప్రముఖ పారిశ్రామికవేత్త, లక్ష్మీ మోటర్స్ అధినేత పాములపాటి రవీంద్రబాబు రూ.6 లక్షల విరాళాన్ని ప్రకటించారు. కుందులరోడ్డులోని కమ్మ బాలికల వసతి గృహంలో గురువారం సమితి అధ్యక్ష, కార్యదర్శులు సామినేని కోటేశ్వరరావు, చుక్కపల్లి రమేష్‌లకు ఆయన చెక్కును అందజేశారు. అనంతరం పాములపాటి రవీంద్రబాబు మాట్లాడుతూ నూతన భవన సముదాయానికి మరింత సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. సామినేని, చుక్కపల్లి రమేష్‌లు మాట్లాడుతూ నూతన భవన నిర్మాణ పనులు ప్రారంభించామని, రెండు సంవత్సరాల్లో పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సమితి ఉపాధ్యక్షుడు వడ్లమూడి నాగేంద్రం, సంయుక్త కార్యదర్శి గుంటుపల్లి కోటేశ్వరరావు, పాలకవర్గ సభ్యులు వడ్లమూడి శివరామకృష్ణయ్య పాల్గొన్నారు.



పాములపాటి రవీంద్రబాబును సత్కరిస్తున్న సామినేని, చుక్కపల్లి రమేష్ తదితరులు

విశ్వబ్రహ్మణులకు రాజకీయ ప్రాధాన్యం లేకపోవడం బాధాకరం

● సంఘం నగర అధ్యక్షుడు కడియాల

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 17: సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో విశ్వ బ్రాహ్మణులకు ఏ రాజకీయ పార్టీ సీట్లు కేటాయించకపోవడం బాధాకరమని నగర విశ్వబ్రహ్మణ సంఘం అధ్యక్షుడు కడియాల సుబ్బారావు అన్నారు. స్థానిక అరండల్‌పేట విశ్వబ్రాహ్మణ కల్యాణమండపంలో గురువారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రధాన రాజకీయ పార్టీలు సీట్లు ఇవ్వకపోవడాన్ని వ్యతిరేకిస్తూ స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేసేందుకు నిర్ణయించినట్లు స్పష్టం చేశారు. ఇందులో భాగంగా నగరంలో పశ్చిమ, తూర్పు నియోజకవర్గాల్లో స్వతంత్ర అభ్యర్థులుగా విశ్వబ్రాహ్మణులు బరిలో దిగుతున్నట్లు తెలిపారు. ఏపీ విశ్వబ్రాహ్మణ సంఘ క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ నాగేశ్వరచారి మాట్లాడుతూ ఈ నెల 22న పశ్చిమ నియోజకవర్గానికి స్వతంత్ర అభ్యర్థిగా కడియాల సుబ్బారావు నామినేషన్ వేయనున్నట్లు తెలిపారు. సంఘ నాయకులు వెంకటాచారి, శివ రాజేశ్వరచారి, లక్ష్మీనారాయణ, శివరామకృష్ణ, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

అమరావతి నమూనా విధ్వంసం చేయటం అనైతిక చర్య

● ఆంధ్రప్రదేశ్ పంచాయతీ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జాస్తి

గుంటూరు సిటీ, ఏప్రిల్ 18 : ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో ఏర్పాటు చేసిన అమరావతి నమూనా మ్యూజియంను ధ్వంసం చేసిన దుండగులను కనిపెట్టి వారిని కఠినంగా శిక్షించాలని ఆంధ్రప్రదేశ్ పంచాయతీ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. సాక్షాత్తు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శంకుస్థాపన చేసిన అమరావతిలో ఉన్న నమూనాను ధ్వంసం చేసిన వారిని చట్టరీత్యా శిక్షించవలసిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. రాజధాని అమరావతి అంటే ఐదు కోట్ల ఆంధ్ర ప్రదేశ్ ప్రజలదని, ప్రభుత్వం అభివృద్ధి చేయకపోగా ఉన్న కట్టడాలను ధ్వంసం చేస్తున్నా ఏమి పట్టనట్టు చూస్తూ ఊరు కోవటం దుర్మార్గం అని జాస్తి వీరంజనేయులు అన్నారు. భవిష్యత్తులో ఇటువంటి చర్యలు జరగ కుండా సీఆర్‌డీఏ కమిషనర్ చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆకట్టుకున్న అన్నమయ్య గీతాలాపన

గుంటూరు, ఏప్రిల్ 18: గుంటూరువారితోటలో శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా గురువారం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆర్‌పీఎల్ నరసింహారావుచే అన్నమయ్య గీతాలాపన కార్యక్రమం ఆహుతులను ఆకట్టుకున్నది. అన్నమయ్య సంకీర్తనలతో భక్తుల్లో భక్తిభావం పెంపొందించారు. కీబోర్డు మీద పాలపర్తి శ్రీనివాసరావు, తబలా మీద వెంకట్ సహకరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఈమని ఆంజనేయ శర్మ కళాకారులను సన్మానించారు.

టీడీపీతోనే మహిళలకు రక్షణ, సంక్షేమం

● పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి గల్లా మాధవి



ఎన్నికల ప్రచారంలో ప్రజలకు అభివాదం చేస్తున్న గల్లా మాధవి

గుంటూరు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో మహిళలకు భద్రత కరువైందని, టీడీపీ ప్రభుత్వంలోనే మహిళలకు రక్షణ, సంక్షేమం లభిస్తుందని టీడీపీ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి గల్లా మాధవి చెప్పారు. గుంటూరు 31వ డివిజన్ ఏటి అగ్రహారంలో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒక్కో మహిళను ఒక్కో మహాశక్తిగా తయారు చేయాలనేది చంద్రబాబు సంకల్పమని అన్నారు. మహాశక్తి పథకాల ద్వారా మహిళలకు లబ్ధి చేకూరి ఆర్థిక ప్రగతి సాధిస్తారని అన్నారు. ప్రతి మహిళా తన కుటుంబంతో ఆనందంగా ఉండాలనే ఆలోచనతోనే డ్వాక్రాని సృష్టించి ఆడపడుచులకు అన్నగా చంద్రబాబు నిలిచారని, వడ్డీ లేని రుణాలు, పావలా రుణాలు, స్వయంశక్తి పథకాలతో మహిళలకు కొత్త జీవితాన్ని ఇచ్చిన చంద్రబాబు నేడు మహాశక్తి అనే పథకంతో మహిళలను మహోన్నత శక్తులుగా తీర్చిదిద్దనున్నారని అన్నారు. ఆడబిడ్డ నిధి ద్వారా నెలకు రూ.1500, తల్లికి వందనం ద్వారా ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుకుంటే అంతమందికి సంవత్సరానికి రూ.15 వేలు, కుటుంబానికి సంవత్సరానికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందిస్తూ, మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం అందించడమే లక్ష్యంగా మహాశక్తి పథకాన్ని రూపొందించారన్నారు. మహిళలందరూ తెలుగుదేశం పార్టీకి మద్దతు ఇచ్చి చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో దాసరి రమణ, దాసరి జ్యోతి, పెమ్మసాని రవి, సింహాద్రి కనకాచారి, మధు లాల్, అడపా మాణిక్యాల రావు,ఆళ్ళ హరి తదితరులు పాల్గొన్నారు.

మాధవికి మందకృష్ణ మాదిగ మద్దతు

పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి గల్లా మాధవికి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ మద్దతు ప్రకటించారు. గుంటూరులోని తన నివాసానికి గురువారం విచ్చేసిన మందకృష్ణ మాదిగకు పుష్పగుచ్ఛం అందించి ఆమె ఘనంగా స్వాగతం పలికారు.



మందకృష్ణ మాదిగకు పుష్పగుచ్ఛం అందిస్తున్న మాధవి

భాష్యం రామకృష్ణను కలిసిన మాధవి



భాష్యం రామకృష్ణకు పుష్పగుచ్ఛం అందిస్తున్న మాధవి

భాష్యం విద్యా సంస్థల అధినేత భాష్యం రామకృష్ణను గురువారం గల్లా మాధవి మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన మద్దతు కోరారు.

● గుంటూరు పట్నం బజారు లోని వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి గుడిలో గల్లా మాధవి గురువారం ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆమెకు ఆర్యవైశ్య ప్రముఖులు జ్ఞాపికను అందజేసి స్వాగతం పలికారు.

● కుమ్మరి శాలివాహనుల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని గల్లా మాధవి తెలిపారు. గుంటూరు ఏటి అగ్రహారంలో ఏర్పాటు చేసిన కుమ్మర శాలివాహనుల ఆత్మీయ సమావేశంలో ఆమె పాల్గొన్నారు. రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాలలో అభివృద్ధి చెందాలంటే తెలుగుదేశం పార్టీతోనే సాధ్యం అని ఆమె తెలిపారు.

ఓటు వినియోగంపై లెట్స్ ఓట్ సంస్థ విస్తృతప్రచారం

గుంటూరు(విద్య), ఏప్రిల్ 18: ఓటు హక్కు వినియోగంపై స్థానిక బృందావన్‌గార్డెన్స్‌లో 'లెట్స్ ఓట్' సంస్థ సభ్యులు ప్లే కార్డ్స్ పట్టుకొని, కరపత్రాలను పంచుతూ, చైతన్య గీతాలు ఆలపిస్తూ ఓటర్లకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధి సిఎస్ నాయుడు మాట్లాడుతూ జాతీయ ఎన్నికల కమిషన్ గుర్తింపు పొందిన లెట్స్ ఓట్ ఆర్గనైజేషన్ పది సంవత్సరాలుగా జాతీయ స్థాయితో పాటు రెండు తెలుగు రాష్ట్రాలలో ప్రజాస్వామ్య మనుగడలో ఓటరు ప్రాధాన్యతను తెలియజేస్తూ ఓటింగ్ శాతం పెరిగేలా కృషి చేస్తుందని తెలిపారు. విశ్రాంత బ్యాంకు ఉద్యోగుల సంఘం నాయకుడు బుల్లి కుమార్, జీవిత బీమా సంస్థ యానియన్ నాయకులు సీతా రమేష్ మాట్లాడుతూ పశ్చిమ నియోజకవర్గంలో మే నెల పదవ తేదీ వరకు అపార్టుమెంట్స్, పార్కులు, వాకింగ్ ట్రాక్స్ వంటి చోట్ల లెట్స్ ఓట్ సభ్యులు ప్రతిరోజు ఓటర్ చైతన్య కార్యక్రమాలు నిర్వహించబోతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ ఎం.మాలకొండయ్య, జిల్లా చాప్టర్ కన్వీనర్ టి.బాలాజీ శ్రీనివాస్, ప్రొఫెసర్ శివాజీ, లక్ష్మీనారాయణరెడ్డి, తేజో కృష్ణ, ఇందిరా, పద్మజ, వేణుశ్రీ, హేమలత, వైష్ణవి తదితరులు పాల్గొన్నారు.

ఓపీవోల ఫారం-12లు తహసీల్దార్‌లు స్వీకరించేలా ఉత్తర్వులివ్వాలి

గుంటూరు(విద్య), ఏప్రిల్ 18 : సార్వత్రిక ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్‌లు ఓపీవోల నుంచి తహసీల్దార్ స్థాయిలోనే స్వీకరించేలా చర్యలు తీసుకోవాలని, దివ్యాంగులు, తీవ్ర అనారోగ్యం ఉన్న వారిని ఎన్నికల విధుల నుంచి తప్పించాలని ఏపీటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు కె .బసవలింగారావు, మహ్మద్‌ఖాలీద్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డికి లేఖ రాశారు. ఏపీవోలు(అదర్ పోలింగ్ ఆఫీసర్స్) ఎక్కువ సంఖ్యలో ఉంటారని, వీరు పోస్టల్ బ్యాలెట్‌ను నియోజకవర్గ స్థాయి తహసీల్దార్‌లకు ఇవ్వాలంటే తీవ్ర వ్యయ, ప్రయాసలకు గురికావాల్సి వస్తుందని తెలిపారు. ఒక్కో నియోజకవర్గస్థాయి తహసీల్దార్ కార్యాలయం 45 కిలోమీటర్లకుపైగా దూరంలో ఉన్నాయని తెలిపారు. దీనివల్ల పోస్టల్ బ్యాలెట్స్ సరిగా వినియోగంలోకి రావని, మండల స్థాయిలోనే తహసీల్దార్‌లకు పోస్టల్ బ్యాలెట్స్ (ఫారం 12)ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఫిరంగిపురం తదితర మండలాల ఏపీవోలు దాదాపు 45 కిలోమీటర్ల దూరంలో ఉన్న తాడికొండ మండల తహసీల్దార్‌కు ఫారం 12లు అందించాల్సి వస్తుందని తెలిపారు.

అగ్నిమాపక వారోత్సవాలు

గుంటూరు సిటీ, ఏప్రిల్ 18 : అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా ఐదవ రోజు నగరంలోని భాష్యం పాఠశాలలో ప్రత్యేక ప్రదర్శన నిర్వహించారు. గుంటూరు-2 అగ్నిమాపక కేంద్రం నుంచి అగ్నిమాపక శకటం, సిబ్బందితో బయలుదేరి భాష్యం స్కూల్, ఆర్టీసీ కాలనీ, గుంటూరు టౌన్‌లో గ్యాస్ ఫైర్, కేర్ లెస్ స్మోకింగ్, ఎలక్ట్రికల్ ఫైర్‌లకు సంబంధించి ఫైర్ డెమో ఇచ్చారు. అదేవిధంగా ఏదైనా అనుకోని ప్రమాదం జరిగినప్పుడు ప్రాథమిక దశలో వాటిని ఏ విధంగా ఉపయోగించాలో ప్రాక్టికల్‌గా మాక్‌డ్రిల్ ద్వారా అక్కడ పని చేస్తున్న సిబ్బందికి, విద్యార్థులకు చూపించారు. కార్యక్రమంలో స్టేషన్ ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసరావు,గుంటూరు-2 అగ్నిమాపక కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.



భాష్యం పాఠశాల విద్యార్థులు, సిబ్బందికి డెమో నిర్వహిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన అవసరం

గుంటూరు(విద్య), ఏప్రిల్ 18 : అగ్నిప్రమాదాల నివారణ, ప్రమాదాలు జరిగిన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని అసిస్టెంట్ ఫైర్ ఆఫీసర్ కె.కృష్ణారెడ్డి సూచించారు. స్థానిక విద్యానగర్‌లోని స్టెమ్ స్కూల్‌లో గురువారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అగ్ని ప్రమాదాలు, విద్యుత్ ప్రమాదాలు, గ్యాస్ వినియోగించే సమయంలో సంభవించే ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఫైర్ సిబ్బంది ఆధ్వర్యంలో ప్రమాదాల నివారణపై అవగా హన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్‌ఎస్‌ఎస్ రాజ్యాధికారం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం

● సీపీఐ(ఎంఎల్) రెడ్‌స్టార్ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి పీజే జేమ్స్

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 17: ఆర్‌ఎస్‌ఎస్ కార్యకలాపాలను దేశంలో పూర్తిగా విస్తరించాలనే లక్ష్యంతో ప్రణాళికలు రూపొందిస్తున్నారని, దీనిని లౌకిక రాజ్యవాదులు అడ్డుకోవాలని సీపీఐ(ఎంఎల్) రెడ్‌స్టార్ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి పీజే జేమ్స్ పిలుపునిచ్చారు. ఫాసిస్ట్ ఆర్‌ఎస్‌ఎస్‌ను ఓడించాలని కోరుతూ ఆ పార్టీ ఆధ్వర్యంలో రూపొందించిన ప్రచార పత్రాల ఆవిష్కరణ కార్యక్రమం బ్రాడీపేట ఎస్‌హెచ్‌వో కార్యాలయంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ పౌర, సైనిక పరిపాలన, న్యాయవ్యవస్థ, విద్య, శాస్త్రీయ పరిశోధన, చరిత్ర-రచన, సంస్కృతితోపాటు స్థూల, సూక్ష్మ రంగాల్లో ఆర్‌ఎస్‌ఎస్ విస్తరించిందని, దీంతో దళితులు, మహిళలతో సహా అణగారిన కులాలు మనుగడ కోల్పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పొలిట్‌బ్యూరో సభ్యుడు మన్నవ హరిప్రసాదు మాట్లాడుతూ ఆర్‌ఎస్‌ఎస్‌ను ఓడించే లక్ష్యంగా పని చేస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో ఏపీ కమిటీ కార్యదర్శి కొల్లిపర వెంకటేశ్వరరావు, వి.పుష్పలత, జీ వెంకట్, షేక్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

ఉర్దూ పాఠశాలలో తనిఖీలు

గుంటూరు(విద్య), ఏప్రిల్ 18 : స్థానిక నల్లచెరువులోని మున్సిపల్ కార్పొరేషన్ ఉర్దూ ప్రాథమిక పాఠశాల నంబర్ 95ను గురువారం ఉర్దూ డీఐ, ఎండీ ఖాసీం సందర్శించి పాఠశాల రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల వార్షిక పరీక్షలో సాధించిన మార్కులను ఈనెల 23లోపు ఆన్‌లైన్‌లో పొందుపరిచి, ప్రగతి పత్రాలను త్వరితగతిన రూపొందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అదేవిధంగా వేసవి కాలంలో ఎండ తీవ్రత దృష్ట్యా ప్రభుత్వ సూచన మేరకు తప్పనిసరిగా రోజుకు మూడుసార్లు వాటర్ బెల్ ద్వారా విద్యార్థులు మంచినీరు తాగే విధంగా చూడాలన్నారు. అదేవిధంగా వచ్చే విద్యా సంవత్సరం విద్యార్థుల నమోదు కొరకు ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు.



రికార్డులు తనిఖీ చేస్తున్న ఉర్దూ డీఐ ఖాసిం

ధర్మచక్రం గ్రంథావిష్కరణ

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 18 : స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై ఢమరుకం లలిత కళాసమితి ఆధ్వర్యంలో గురువారం సాహితీవేత్త చిట్టిప్రోలు వెంకటరత్నం రచించిన ధర్మచక్రం చారిత్రాత్మక పద్యనాటక పుస్తకావిష్కరణ సభ జరిగింది. సభకు రచయిత గన్నె వాసుదేవరావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ సూర్యదేవర రవికుమార్ గ్రంథాన్ని ఆవిష్కరించారు. సాహితీవేత్త డాక్టర్ వెలువోలు నాగరాజ్యలక్ష్మి గ్రంథ సమీక్ష నిర్వహించారు. ప్రముఖ హరికథా భాగవతార్ తుర్లపాటి శంభయాచార్యులు నాటక పద్యాలను శ్రావ్యంగా ఆలపించారు. సభలో సాహితీవేత్తలు డాక్టర్ గుమ్మా సాంబశివరావు, ఆలయ పాలకమండలి అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, రంగస్థల నటుడు ఎం.అర్జునరావు, వి. మల్లికార్జునాచారి తదితరులు పాల్గొని రచయిత చిట్టిప్రోలు వెంకటరత్నంను ఘనంగా సత్కరించారు.



ధర్మచక్రం గ్రంథావిష్కరణలో పాల్గొన్న సాహితీ వేత్తలు, ఆలయ కమిటీ సభ్యులు

రంగస్థల నాటకంపై మక్కువ పెంచుకున్న పెదబాపిరెడ్డి

గుంటూరు, ఏప్రిల్ 18 : విద్యార్థి దశ నుంచే రంగ స్థల నాటకంపై మువ్వా పెదబాపిరెడ్డి మక్కువ పెంచుకొని గొప్ప కళాకారుడిగా ఎదిగారని అవగాహన సంస్కృతిక కార్యక్రమాల కో ఆర్డినేటర్ బిళ్ళ అశోక్ అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో నాటక రంగ దినోత్సవం సందర్భంగా ప్రముఖ రంగస్థల నటుడు, గాయకుడు మువ్వా పెదబాపిరెడ్డిని సంస్థ సభ్యులు గురువారం ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మువ్వా పెదబాపిరెడ్డి శ్రీరామునిగా, అర్జునుడిగా, కృష్ణుడిగా నటిస్తూ ప్రేక్షకుల ఆదరాభిమానాలని చూరగొన్నారన్నారు. ఎన్నో పురస్కారాలు, సత్కారాలు, బహుమతులు పొందిన బాపిరెడ్డి గుంటూరు నాటక రంగానికి ఎనలేని పేరు తెచ్చారన్నారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, బొల్లేపల్లి సుబ్బారావు, దామస్, చంద్రబాబు, వెంకాయమ్మ, యార్లగడ్డ లక్ష్మి, అయుబ్ ఖాన్ లు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులను గాలికొదిలేసిన వైసీపీ ప్రభుత్వం

● ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్‌వలి

గుంటూరు, ఏప్రిల్ 18 : చిరు వ్యాపారుల సమస్యలను పట్టించుకోకుండా వైసీపీ ప్రభుత్వం వారిని గాలికొదిలేసిందని ఇండియా కూటమి గుంటూరు తూర్పు నియోజకవర్గ అభ్యర్థి షేక్ మస్తాన్‌వలి ఆగ్రహం వ్యక్తం చేశారు. పీవీకే నాయుడు కూరగాయల మార్కెట్, చేపల మార్కెట్‌లలో గురువారం ఆయన ప్రచారం నిర్వహించారు. చిరు వ్యాపారులను పేరుపేరున పలకరిస్తూ వైసీపీ ప్రభుత్వం చేసిన మోసాలను వివరిస్తూ ప్రచారం చేశారు. చిరు వ్యాపారులకు ఇండియా కూటమి అండగా ఉంటుందని భరోసా కల్పించారు. అభివృద్ధి పేరుతో వైసీపీ ప్రభుత్వం కూరగాయల మార్కెట్‌ను కూల్చివేసి ఇప్పటి వరకు దానిని నిర్మించకుండా చిరు వ్యాపారులకు నిలువనీడ లేకుండా చేసిందని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో ఇస్మాయిల్, రత్తయ్య, సాంబయ్య, బుజ్జి, జాని, మోషయా, మోబిన్, రెహమాన్, అమీద్, తిరుమలరావు, కరీమ్, మౌలాలి, సలాం, షరీఫ్, హమీద్ తదితరులు పాల్గొన్నారు.

మల్లెల రాజేష్ వ్యాఖ్యలపై మంత్రి రజిని స్పందించాలి

● టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కనపర్తి డిమాండ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కనపర్తి శ్రీనివాసరావు

గుంటూరు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): మంత్రి విడదల రజినికి ఏ మాత్రం నైతిక విలువలున్నా టీడీపీ పశ్చిమ పరిశీలకుడు మల్లెల రాజేష్ నాయుడు సంధించిన ప్రశ్నలకు సమాధానం చెప్పాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రజిని చేసిన అవినీతి, అరాచకాలను సొంత పార్టీ నేతలే భరించలేక పక్క జిల్లాకు బదిలీ చేశారని ఎద్దేవా చేశారు. సకల శాఖా మంత్రి సజ్జల రామకృష్ణారెడ్డి అండదండలతో ఆకాశమే హద్దుగా మంత్రి అవినీతికి పాల్పడ్డారని మండిపడ్డారు. ప్రతి పనికి ఒక రేటు పెట్టి డబ్బు వసూలు చేసిన అవినీతి అనకొండ రజిని అని విమర్శించారు. అవినీతి, అరాచకాలకు పాల్పడకపోతే రాజేష్ అడిగిన ప్రశ్నలకు ఆమె ఎందుకు స్పందించటం లేదని ఆయన ప్రశ్నించారు. గత ఎన్నికల్లో బీసీ బిడ్డనని ప్రచారం చేసుకొని చిలకలూరిపేట ప్రజలను మోసం చేసిన రజిని ఇప్పుడు గుంటూరు పశ్చిమ ప్రజలను కాపు కులం పేరుతో మోసం చేయటానికి శతవిధాల ప్రయత్నిస్తుందని అన్నారు. అంతిమంగా ఆమెది 'డబ్బుకులం' మాత్రమే అన్న విషయం అన్నీ వర్గాల ప్రజలు గుర్తించాలని కోరారు. రజిని, రోశయ్య లాంటి అవినీతి అనకొండలను తరిమి కొట్టడం ఖాయమని కనపర్తి తేల్చి చెప్పారు. సమావేశంలో రాష్ట్ర ఎస్సీ సెల్ నాయకులు కోడూరి అఖిల్, బొల్లెద్దుల సుశీలరావు తదితరులు పాల్గొన్నారు

మైనార్టీలకు వైసీపీ హామీలు నీటిమీద రాతలే

● మిర్చియార్డు మాజీ డైరెక్టర్ షేక్ చిన్న బాజీ



చినిగిన బనీన్లతో నిరసన తెలుపుతున్న మైనార్టీ నేతలు

గుంటూరు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): మైనార్టీలకు వైసీపీ ఇచ్చిన హామీలు నీటి మీద రాతలేనని మిర్చియార్డు మాజీ డైరెక్టర్ షేక్ చిన్న బాజీ ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో ముస్లిం మైనార్టీల దుస్థితి ఈవిధంగా ఉందంటూ చిరిగిపోయిన బనియన్లు వేసుకొని వారు నిరసన తెలియజేశారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుత ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి, ఎదుగుదలకు అనేక రకాలుగా అడ్డుకట్ట వేస్తోందని, ఇచ్చిన వాగ్దానాలు కూడా నిలబెట్టుకోలేని ఈ ప్రభుత్వం మైనార్టీలకి నమ్మక ద్రోహం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2019 ఎలక్షన్ ముందు చేసిన పాదయాత్రలో ముస్లిం మైనారిటీల కొరకు ఇస్లామిక్ బ్యాంకును ప్రారంభిస్తామని హామీ ఇచ్చిన వైసీపీ ఇప్పుడు కనీసం కార్పొరేషన్‌కు నిధులు కూడా కేటాయించలేదన్నారు. దుల్హన్ పేరుని షాదీ తోఫాగా మార్చిందే తప్ప అమలు చేయ లేదన్నారు. టీడీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి కేఎంఈ హుస్సేన్ మాట్లాడుతూ నాడు టీడీపీ మైనార్టీల కోసం భవనాలు నిర్మిస్తే, నేడు వైసీపీ దాడులు చేసి భూముల్ని కబ్జా చేస్తోందని ఆయన ఆరోపించారు. ఈ సమావేశంలో షేక్ జాఫర్, షేక్ అన్వర్, షేక్ జానీ, షేక్ రహమతుల్లా, సయ్యద్ ఆదం పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఉద్యోగులకు, ప్రజలకు తీవ్ర అవస్థలు



ఉద్యోగులను ప్రశ్నిస్తున్న పోలీసులు

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 18 : నామినేషన్ల సందర్భంగా కలెక్టరేట్ ఎదుట పోలీసులు హడావుడి చేశారు. దీంతో పనులపై వచ్చిన ప్రజలు, చివరకు కలెక్టరేట్ ఉద్యోగులు కూడా తీవ్ర అవస్థలు పడ్డారు. ఉద్యోగుల గుర్తింపు కార్డు చూపించిన వారికి మాత్రమే అనుమతి ఇచ్చారు. సామాన్య ప్రజలకు మాత్రం మధ్యాహ్నం మూడు గంటల తరువాత అనుమతి ఇస్తామని స్పష్టం చేశారు. అత్యవసర పని చెప్పినప్పటికి పోలీసులు అనుమతి నిరాకరించారు. దీంతో మూడు గంటల వరకు ఎండలోనే వేచి ఉన్నారు. ముఖ్యంగా మహిళలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అలాగే కలెక్టరేట్ లోపలికి వచ్చే ప్రతి వాహనాన్ని తనిఖీ చేశారు. దీంతో కలెక్టరేట్ ఎదుట చిన్నపాటి ట్రాఫిక్ సమస్యలు ఏర్పడ్డాయి. అలాగే నామినేషన్ల సందర్భంగా కలెక్టరేట్ లోపల అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. ప్రత్యేకంగా బారికేడ్లు, సూచనలు, సలహాలు ఇచ్చేలా బ్యానర్లును ఏర్పాటు చేశారు.

రైల్వేలో ఘనంగా ప్రపంచ వారసత్వ దినం



రైల్వేస్టేషన్‌లో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ని పరిశీలిస్తున్న డీఆర్‌ఎం రామకృష్ణ

గుంటూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వారసత్వ దినాన్ని రైల్వేలో ఘనంగా నిర్వహించారు. గుంటూరు రైల్వేస్టేషన్‌లోని ఫ్లాట్‌ఫాం నెంబరు.1లో రైల్వే థీమ్‌పై ఏర్పాటు చేసిన వారసత్వ ప్రదర్శనని గురువారం డీఆర్‌ఎం ఎం.రామకృష్ణ సందర్శించారు. ప్రదర్శనలో భాగంగా రైల్వేలపై పోస్టేజి స్టాంపులు, అరుదైన నాణేలు, రైల్వే చిత్రాలతో నోట్లు, స్టీమ్ ఇంజిన్‌లు, కోచ్‌లు, రైల్వేకి సంబంధించిన అరుదైన చిత్రాలు, పాత పుస్తకాలు, మేగజైన్‌లను రిటైర్డు అధికారి ఎంవీఎస్ ప్రసాదు ఏర్పాటు చేశారు. ప్రదర్శనని సందర్శించిన డీఆర్‌ఎం వారసత్వ సంపదని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. న్యూగుంటూరు రైల్వేస్టేషన్‌లో పాత 35 టన్నుల సామర్థ్యం కలిగిన ఎంజీ స్టీమ్ క్రేన్‌తో శాశ్వత ప్రదర్శన ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.

పశ్చిమను ఆదర్శంగా తీర్చిదిద్దుతా

గుంటూరు, ఏప్రిల్ 18: గుంటూరు పశ్చిమ నియోజకవర్గం నుంచి తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, గుంటూరు పశ్చిమ వైసీపీ అభ్యర్థి విడదల రజిని హామీ ఇచ్చారు. ప్రచారంలో భాగంగా మంత్రి రజిని 20వ డివిజన్‌లోని నల్లచెరువులో పర్యటించారు. కార్యక్రమంలో డివిజన్ వైసీపీ నాయకులు కంతేటి శ్యామ్, ఖాజా మొహియుద్దీన్, శ్రీనివాసరెడ్డి, రామిశెట్టి రవి, నాగూర్, ఇర్ఫాన్, జుబేర్, టెంట్ హౌస్ బాబు, ఇబ్రహీం, బాబు పాల్గొన్నారు. అలానే 52వ డివిజన్‌లో చంద్రయ్య నగర్, రజక కాలనీల్లో మంత్రి పర్యటించారు. డిప్యూటీ మేయర్ డైమండ్‌బాబు, కో ఆప్షన్ మెంబర్, మాజీ కార్పొరేటర్ ఆలా సాంబశివరావు, డివిజన్ అధ్యక్షుడు మాదాల కిరణ్, కడియం రామాంజనేయులు, రెడ్డి కోటేశ్వరరావు, మద్దుల రాజా యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



లోకేశ్ నామినేషన్ ర్యాలీలో పాల్గొన్న అమరావతి రాజధాని మహిళలు

సీన్ రిపీట్..


- పొన్నూరులో నరేంద్రపై ఎప్పుడూ కొత్త ప్రత్యర్థులే...
- ఆరు ఎన్నికల్లో ఐదుగురిపై గెలుపు
- ఏడోసారి తెరపైకి మరో అభ్యర్థి



గుంటూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): పొన్నూ రు అసెంబ్లీ నియోజక వర్గంలో తెలుగు దేశం పార్టీ అభ్యర్థి ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ప్రతీ ఎన్నికలోనూ కొత్త అభ్యర్థితో తలపడుతూ వస్తున్నారు. ఆయనపై ప్రత్యర్థులను బరిలోకి దింపిన కాంగ్రెస్, వైసీపీలు అదే ఆనవాయితీని కొనసాగిస్తున్నాయి. ఈ దఫా కూడా సీన్ రిపీట్ అవుతోంది. తండ్రి మరణంతో వారసత్వంగా ధూళిపాళ్ల నరేంద్రకుమార్ 1994లో పొన్నూరు నుంచి రాజకీయాల్లోకి ప్రవేశించారు. 1983 నుంచి ఇప్పటివరకు టీడీపీ ఆవిర్భవించిన తరువాత జరిగిన 9 ఎన్నికల్లోనూ పొన్నూరులో ధూళిపాళ్ల కుటుంబమే పోటీ చేస్తూ వచ్చింది. నరేంద్రకుమార్ తండ్రి వీరయ్య చౌదరి 1983, 1985, 1989లో ఇక్కడి నుంచి పోటీ చేశారు. 1989లో ఓడిపోగా 1983, 1985లో గెలుపొందారు. 1988-89లో ఏడాది పాటు రాష్ట్ర రెవెన్యూ మంత్రిగా పని చేశారు. 1989 ఎన్నికల్లో రెవెన్యూ మంత్రిగానే ఉంటూ కాంగ్రెస్ అభ్యర్థి చిట్టినేని వెంకటరావుపై ఓడిపోయారు.

ఆరుసార్లు మారిన నరేంద్ర ప్రత్యర్థులు..

ధూళిపాళ్ల నరేంద్రకుమార్ 1994 నుంచి 2019వరకు జరిగిన ఎన్నికల్లో ఆయన ఐదుసార్లు గెలుపొందగా ఒకసారి ఓటమి పాలయ్యారు. నరేంద్రపై ఆరుసార్లు ప్రత్యర్థులు మారారు. త్వరలో జరగబోయే ఎన్నికల్లో అంబటి మురళీకృష్ణకు వైసీపీ టిక్కెట్ ఖరారు చేసింది. దీంతో నరేంద్రపై ఏడోసారి కొత్త అభ్యర్థి పోటీ పడబోతున్నారు. ఈ నేపథ్యంలో ఆయనపై పోటీ ఎప్పుడూ కొత్త అభ్యర్థే అనే ఆనవాయితీ కొనసాగుతోంది.



నరేంద్రకుమార్ తండ్రి వీరయ్య చౌదరి మరణంతో 1994 అసెంబ్లీ ఎన్నికల ముందు రాజకీయాల్లో చేరారు. తండ్రి నిర్వహించిన సంగం డెయిరీ చైర్మన్, పొన్నూరు ఎమ్మెల్యే పదవులను తనయుడు నరేంద్రకుమార్ కైవసం చేసుకున్నారు. 2009లో పొన్నూరు నియోజకవర్గం పునర్విభజనతో రూపురేఖలు మారాయి. ప్రస్తుతం పెదకాకాని, పొన్నూరు, చేబ్రోలు మండలాలు, పొన్నూరు పురపాలక సంఘం ఈ నియోజకవర్గ పరిధిలో ఉంది.

ఆనవాయితీ ప్రకారం మారిన అభ్యర్థి...

పొన్నూరులో నరేంద్రపై ప్రత్యర్థి మారడం ఆనవాయితీగా వస్తుంది. దానిలో భాగంగా ప్రత్యర్థి కిలారి రోశయ్య తిరిగి పోటీ చేయాలని భావించారు. అయితే అయన్ని వైసీపీ అధిష్ఠానం గుంటూరు ఎంపీ అభ్యర్థిగా ఖరారు చేసింది. దీంతో అంబటి రాంబాబు సోదరుడు మురళీకృష్ణని ఈ సారి కొత్త అభ్యర్థిగా వైసీపీ ఎంపిక చేసింది.

నరేంద్రపై పోటీ చేసిన వారి వివరాలు..

1994 - తలశిల వెంకటరామయ్య చౌదరి
1999 - చిట్టినేని ప్రతాప్
2004 - మన్నవ రాజకిషోర్
2009 - మారుపూడి లీలాధరరావు
2014 - రావి వెంకట రమణ
2019 - కిలారి రోశయ్య

అపూర్వ ఘట్టం

- కోలాహలంగా నారా లోకేశ్ నామినేషన్
- భారీగా తరలివచ్చిన టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు
- అడుగడుగునా ప్రజల నుంచి అపూర్వ స్పందన
- సర్వమత ప్రార్థనలతో ర్యాలీని ప్రారంభించిన నేతలు
- లోకేశ్ తరపున నామినేషన్ దాఖలు చేసిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నేతలు



లోకేశ్ నామినేషన్ ర్యాలీలో పాల్గొన్న టీడీపీ, బీజేపీ, జనసేన శ్రేణులు

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 18: మంగళగిరిలో నారా లోకేశ్ నామినేషన్ ఘట్టం జన జాతరను తలపించింది. నామినేషన్ కార్యక్రమానికి లోకేశ్ హాజరు కాకపోయినప్పటికీ... ఆయన తరపున ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నేతలు నామినేషన్ దాఖలు చేశారు. ఆయా పార్టీల నేతలు, కార్యకర్తలు అసంఖ్యాకంగా తరలిరావడంతో గురువారం మంగళగిరి పట్టణంలో తిరునాళ్ల వాతావరణం నెలకొంది. తొలుత గురువారం ఉదయం పది గంటలకు టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు పాతమంగళగిరి సీతారామస్వామి కోవెలలో నామినేషన్ పత్రాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి వేదపండితుల ఆశీర్వచనాలు పొందారు. అనంతరం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నేతల ఆధ్వర్యంలో హిందూ, ముస్లిం, క్రిస్టియన్ మతపెద్దలు సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్దయ్య మాట్లాడుతూ మంగళగిరి చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో లక్ష ఓట్ల మెజార్టీతో లోకేశ్ గెలవబోతున్నారని చెప్పారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి చిల్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ నారా లోకేశ్ నామినేషన్ ఘట్టం మంగళగిరి చరిత్రలో ఓ సువర్ణాధ్యాయమన్నారు. బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పంచుమర్తి ప్రసాద్ మాట్లాడుతూ మంగళగిరి సమగ్రాభివృద్ధి సాధించాలంటే రాబోయే ఎన్నికల్లో నారా లోకేశ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. అనంతరం పాతమంగళగిరి సీతారామస్వామి కోవెల వద్ద నుంచి నిర్వహించిన భారీర్యాలీ జైత్రయాత్రలా సాగింది. టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులతో పురవీధు లు హోరెత్తాయి. పాత కూరగాయల మార్కెట్, మిద్దె సెంటరు, వైష్ణవి కల్యాణ మండపం, పాతబస్టాండు మీదుగా ర్యాలీ కొనసాగింది. ర్యాలీకి మద్దతుగా ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎమ్మార్పీఎస్, పలు దళిత సంఘాల నేతలు లోకేశ్‌కు మద్దతుగా ర్యాలీలో పాల్గొన్నారు. ర్యాలీ అనంతరం మధ్యాహ్నం 2:34 గంటలకు కూటమికి చెందిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ నాయకులు లోకేశ్ తరపున రెండుసెట్ల నామినేషన్లను దాఖలు చేశారు. నామినేషన్ పత్రాలను మంగళగిరి ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజకుమారి గణియాకు అందజేశారు.

ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు దామర్ల రాజు, మండల అధ్యక్షుడు తోట పార్థసారధి, బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తికొండ ధనుంజయరావు, ఉపాధ్యక్షులు రేఖా సుధాకర్‌గౌడ్, కాండ్రు శ్రీనివాసరావు, ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దొప్పలపూడి జ్యోతిబసు, తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల జయసత్య, మైనార్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు మహమ్మద్ ఇబ్రహీం, టీడీపీ గుంటూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, ఏపీ పంచాయతీ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు జాస్తి వీరాంజనేయులు, ఎన్డీఏ కూటమి నేతలు వేమూరి మైనర్‌బాబు, తమ్మిశెట్టి జానకీదేవి, షేక్ రియాజ్, జగ్గారపు శ్రీనివాసరావు, ఇట్టా పెంచలయ్య ఆరుద్ర భూలక్ష్మీ, దొంతిరెడ్డి సాంబిరెడ్డి, బేతపూడి విజయ్‌శేఖర్, సంకా బాలాజీగుప్తా, గోవాడ దుర్గారావు, రంగిశెట్టి బాబీ, విన్నకోట శ్రీనివాసరావు, మన్నెం రమేష్‌బాబు, కొత్తపల్లి శ్రీనివాసరావు, నైనాల లావణ్య, చాగంటిపాటి పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



లోకేశ్ నామినేషన్ పత్రాలతో పాతమంగళగిరి సీతారామస్వామి కోవెలలో పూజలు నిర్వహిస్తున్న టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు



లోకేశ్ నామినేషన్ సందర్భంగా యువకుల కోలాహలం



లోకేశ్ నామినేషన్ ర్యాలీలో పాల్గొన్న ముస్లిం మైనార్టీలు




లోకేశ్ నామినేషన్‌కు ముందు ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లిం మైనార్టీలు



లోకేశ్ నామినేషన్‌కు ముందు ప్రార్థనలు నిర్వహిస్తున్న పాస్టర్లు

పట్టర పట్టు... కోవర్టు!

- ఎన్నికల వేళ జోరుగా జెండాల మార్పు
- నేతలను వెంటాడుతున్న కోవర్టుల భయం
- పార్టీ జెండా ఒకటి... పనిచేసేది మరొకరికి
- రాజకీయ వ్యూహాల విషయంలో జాగ్రత్తపడుతున్న నాయకులు



బాపట్ల, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ఎన్నికల వేళ నేతలకు సరికొత్త చిక్కు వచ్చిపడింది. నిన్నమొన్నటి వరకు ప్రత్యర్థి పార్టీలో ఉన్న నేతలు ఇప్పుడు సొంతవారయ్యారు.. ఇలా జోరుగా గోడ దూకుడుల పర్వం కొనసాగుతోంది. ఇంతవరకు బాగానే ఉన్నా నేతలకు ఇప్పుడు కోవర్టుల భయం పట్టుకుంది. స్వపక్షంలోనే ఉండి పనిచేసే కన్నా ప్రత్యర్థి వర్గంలోకి చేరి వారి ఆనుపానులను చేరవేయడం ఓ రాజకీయం. స్వపక్షంలోనే కొనసాగుతూ వారి వ్యూహాలను ప్రత్యర్థి పార్టీకి చేరవేయడం మరో కోవర్టు కళ. రాజకీయ పార్టీల గెలుపు ఎత్తుల్లో ఇది కూడా ఓ వ్యూహమే. పార్టీలోకి వచ్చేవారిని కాదనలేము.. అలా అని అందరినీ కోవర్టులుగా చూడలేం... కానీ ఒకరిద్దరు మాత్రం ఈ తరహా వ్యక్తులు కచ్చితంగా ఉంటారని నేతలే నమ్ముతున్నారు. ఇప్పుడు వచ్చిన చిక్కల్లా ఆ కోవర్టులను ఎలా పసిగట్టడం అనేది మాత్రమే... ముల్లుకు ముల్లు విరుగుడే అన్న చందాన ప్రధాన రాజకీయ పార్టీలన్నీ ప్రత్యర్థుల శిబిరాల్లో కోవర్టులను ఇప్పటికే మోహరించాయి. వీరి ద్వారానే తమ దగ్గర ఉన్న కోవర్టుల పేర్లు తెలుసుకునే సరికి అవాక్కవడం వారి వంతవుతోంది. ఫలానా వ్యక్తి కోవర్టు అని తెలిసినా బహిరంగంగా అది వెలిబుచ్చలేని వింత పరిస్థితి నేతలది. ఎందుకంటే ఇది ఎన్నికల వేళ కనుక.. ప్రతి ఓటు, ప్రతి నేత విలువైన వారే కావడంతో వారిని పార్టీలోనే ఉంచుతూ వారి విషయంలో జాగ్రత్త వహిస్తూ ఎన్నికల కార్యం జరిపించుకోవడమే ప్రస్తుతం నేతల ముందు ఉన్న తక్షణ కర్తవ్యంగా భావిస్తున్నారు.

నేతల్లో టెన్షన్..

రాజకీయం అంటేనే ఎదుటివారి బలాలు, బలహీనతలు తెలుసుకుని వాటికి అనుగుణంగా వైరి వర్గాలు గెలుపు వ్యూహాలు రచిస్తూ ఉంటాయి. కానీ నిన్న మొన్నటి వరకు తమ వెంట తిరిగిన వారు ఇప్పుడు ఆవల పక్షాన కనబడుతుండే సరికి వారిలో టెన్షన్ కనబడుతోంది. ఎందుకంటే వారి లోగుట్టులన్నీ సదరు నేతలకు తెలిసి ఉండడమే అందుకు కారణం. తన అంతరంగీకులుగా మెలిగే ఒకరిద్దరి నేతల వద్ద మాత్రమే ఎన్నికల వ్యూహాలకు సంబంధించిన వివరాలు పంచుకుంటున్నారు. గోడలకు చెవులు ఉండొచ్చు అనే చందాన అత్యంత రహస్యంగా ఎన్నికల ప్రణాళికలకు పదును పెడుతూ కోవర్ట్ రాజకీయాలకు చెక్ పెట్టాలనే తలంపుతో నేతలు ఉన్నారు.

కోవర్ట్‌లు పలు రకాలు....

ఎన్నికల వేళ రాజకీయ పార్టీలు వివిధ రకాలుగా కోవర్ట్ ఆపరేషన్ చేపడుతుంటాయి. వాటిలో ముఖ్యంగా ప్రత్యర్థి శిబిరంలోనే ఉంచి దెబ్బతీయడం. ఇటీవల ఓ అభ్యర్థి వద్దకు ద్వితీయశ్రేణి నేత ఒకరు తాను ప్రస్తుతం ఉన్న పార్టీ వదిలేసి మీ గూటికి వస్తానని వర్తమానం పంపారు. సదరు అభ్యర్థి మాత్రం పార్టీ మారేకంటే అక్కడే ఉండి వారి పథక రచనలన్నీ తనకు చేరవేయాలని ఇదే తనకు చేసే మేలు అని చెప్పారు. అంతే అటు పార్టీ మారినట్లయింది.. ఇటు కోవర్ట్ ఆపరేషన్ మొదలయింది. ఇక రెండోది ఆవల శిబిరంలోకి వెళ్లి వారి నేతలు, కార్యకర్తలతో మమేకం అయిపోయి వారి వ్యవహారాలన్నీ గుట్టుచప్పుడు కాకుండా తన సొంత శిబిరం నేతలకు చేర్చడం. ఇదో రకం కోవర్టు వ్యవహారం. ఇక మూడో రకం కోవర్టులు కూడా ఉన్నారండోయ్.. వీరు తటస్థంగా ఉన్నట్లు కలరింగ్ ఇస్తూ ఏదో ఒక పక్షానికి లోపాయికారిగా పనిచేయడం. పోలీసులు నేరుగా డబ్బు ఉన్న చోటుకు వెళ్లే దాడులు కొన్ని సందర్భాల్లో నిర్వహిస్తుంటారు. ఇదంతా ఈ తటస్థ కోవర్టుల పుణ్యమే. ఇలా కోవర్టులందు రకాలు వేరయా అన్న చందాన వీరితో పెను ప్రమాదం కూడా అభ్యర్థులకు పొంచి ఉందండోయ్.

భలే అవకాశవాదం..

కోవర్ట్‌లకు మరో అవకాశం కూడా ఉంది. ప్రత్యర్థి పార్టీ ప్రయోజనాల కోసం పనిచేసినా ఇవతల పార్టీనే గెలిస్తే గుట్టుచప్పుడు కాకుండా ఆ విజయం క్రెడిట్‌ను తనఖాతాలో వేసుకుని ఎంచక్కా ఆ నేత నీడలోనే ఉండొచ్చు. ఇలా కాకుండా ఎవరికోసమయితే కోవర్టు అవతారమెత్తారో వారే గెలిస్తే దర్జాగా మళ్లీ వారి దగ్గరకు వెళ్లిపోయి అక్కడా గెలుపు క్రెడిట్‌ను తన ఖాతాలో వేసుకునే ఉభయకుశలోపరి సౌలభ్యం కోవర్టులకు మాత్రమే ఉంది.

అందరూ మంచివారే.. కానీ..

అధికార పార్టీ మీద అసంతృప్తితో పాటు ప్రభుత్వ నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగానో, పార్టీల ఏకపక్ష ధోరణి నచ్చకనో పార్టీలు మారడం సహజం. ఇలా మారే వారిలో చాలా మంది నిజంగా నిండుమనసుతో పార్టీ మారేవారే. కానీ ఒకరిద్దరు మాత్రం కోవర్టు రాజకీయం చేస్తుంటారు. ఈ మొత్తంలో వారిని పసిగట్టడమే పార్టీలకు పెద్ద కోవర్ట్ పరీక్ష ప్రస్తుతం. ఒక్కోసారి నిబద్ధత కలిగిన నేతనే పూర్వపక్షం చేసి కోవర్టుకే పెద్దపీట వేసే నేతాగణానికీ కొదవేలేదు. ఇలా జరిగితే దెబ్బకు పుట్టి మునగడం ఖాయమవడంతో పాటు తీరా ఫలితం వచ్చాక కోవర్టు దెబ్బకు రిజల్ట్ తారుమారు అయిందని ఎంత వగచినా ప్రయోజనం గుండుసున్నా. అందుకే నేతలూ కోవర్టులతో బహుపరాక్... జాగ్రత్త

కోన రాగాలు!

- బాపట్లలో సినీ స్టూడియో ఏర్పాటు అంటూ కోన వెంకట్ ప్రకటన
- గతంలోనూ ఇదే హడావిడి, ఆచరణ శూన్యం
- ఎన్నికల జిమ్మిక్కుగా కొట్టిపారేస్తున్న ప్రజలు

బాపట్ల, ఏప్రిల్18(ఆంధ్రజ్యోతి): సరిగ్గా ఎన్నికల వేళ బాపట్లలో సినీ స్టూడియో కట్టి ఉపాధి అవకాశాలు కల్పిస్తానంటూ సినీ నిర్మాత కోన వెంకట్ గురువారం మీడియా సమావేశంలో ప్రకటించడం చర్చకు దారి తీసింది. ఈయన బాపట్ల వైసీపీ ఎమ్మెల్యే కోన రఘుపతి బంధువు కావడంతో పాటు ఆయన గెలుపుకోసం విస్తృతంగా ప్రచారం కూడా చేస్తున్నారు. 2019 ఎన్నికల వేళ, తర్వాత కూడా బాపట్లలో స్టూడియో ఏర్పాటు అంటూ ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపించారు. మధ్యలో రాజకీయ పరమైన కారణాలతో స్టూడియో నిర్మాణం అడుగులు ముందుకు పడలేదనే అభిప్రాయం వ్యక్తం చేశారు. మళ్లీ ఇప్పుడు ఎన్నికల వేళ స్టూడియో ఏర్పాటు అంశాన్ని తెరమీదకు తేవడంతో ఇవన్నీ ఓట్ల కోసం జిమ్మిక్కులేననని బాపట్ల ప్రజలు కొట్టిపారేస్తున్నారు.



కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహిస్తున్న ఎన్నికల వ్యయ పరిశీలకులు

ప్రలోభాలను అరికట్టాలి

- ఎన్నికల వ్యయ పరిశీలకుడు మ్రిణాల్‌దాస్

గుంటూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఓటర్లను అభ్యర్థులు నగదు, మద్యం, ఉచిత బహుమతులతో ప్రలోభాలకు గురిచేయకుండా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు, ప్రత్యేక బృందాలు సమన్వయంతో నిరంతరం నిఘా పెట్టి తనిఖీలు నిర్వహించాలని గుంటూరు లోక్‌సభ నియోజకవర్గ వ్యయ పరిశీలకుడు మ్రిణల్‌కుమార్‌దాస్ తెలిపారు. గురువారం ఆయన అసెంబ్లీ నియోజకవర్గాల వ్యయ పరిశీలకులు రాధానాథ్ పురోహిత్, ఎర్నే వినోద్ కుమార్ చంద్రాబాన్, గుంటూరు జిల్లా ఎన్నికల అధికారి వేణుగోపాల్‌రెడ్డి, ఎస్పీ తుషార్ కుమార్‌డూడీతో కలిసి కలెక్టరేట్‌ని సందర్శించారు. ఎన్నికల కంట్రోల్ రూం, సీవిజిల్, ఎన్కోర్, ఎంసీసీ, ఈఎస్ఎంఎస్ పర్యవేక్షణ విభాగాల పనితీరును పరిశీలించారు. సీవిజిల్, కంట్రోల్ రూం, ఇతర పిర్యాదులు క్షేత్ర స్థాయిలో నియమించిన ప్రత్యేక అనంతరం ఎస్ఆర్ శంకరన్ హాలులో జరిగిన సమావేశంలో మ్రిణల్‌కుమార్‌దాస్ మాట్లాడుతూ ఎస్ఎస్టీ, ఎఫ్ఎస్టీ ఇతర ప్రత్యేక బృందాల సమాచారంతోనే కాకుండా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలైన కేంద్ర, రాష్ట్ర జీఎస్టీ, ఆదాయపు పన్ను శాఖ అధికారులు సొంతంగా నిఘాపెట్టాలన్నారు. బ్యాంకులలో జరిగే అనుమానస్పద లావాదేవీలపై బ్యాంకర్లు నిరంతర నిఘా పెట్టి వివరాలు ఎప్పటికప్పుడు జిల్లా ఎన్నికల అధికారులకు తెలియచేయాలన్నారు. జిల్లా ఎన్నికల అధికారి మాట్లాడుతూ జిల్లాలో పట్టణ ప్రాంతాల్లో ఓటింగ్ శాతం పెంచడంతో పాటు, జీరో రీపోల్, జీరో వైలన్స్, నగదు, మద్యం, ఉచిత బహుమతుల ప్రలోభం లేకుండా స్వేచ్ఛగా ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకునే లక్ష్యంలో అవసరమైన అన్ని చర్యలు పటిష్టంగా తీసుకున్నట్లు చెప్పారు. సమావేశంలో రిటర్నింగ్ అధికారులు రాజకుమారి, కీర్తీ చేకూరి, ప్రఖార్ జైన్, స్పెషల్ డిప్యూటీ కలెక్టరు గంగరాజు, ఆర్డీవో శ్రీకర్, డీఆర్వో పెద్ది రోజా తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల పరిశీలకుల ఫోన్ నెంబర్లు

ఎన్నికల్లో భాగంగా అభ్యర్థులు ఎవరైనా అదనంగా ఖర్చు పెడుతున్నా, ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తున్నా ఎన్నికల వ్యయ పరిశీలకుల దృష్టికి తీసుకెళ్లొచ్చు. వారికి ఫోన్ ద్వారా సమాచారం అందించొచ్చు.

- గుంటూరు పార్లమెంట్ ఎన్నికల వ్యయ పరిశీలకుడు మృణాల్‌కుమార్ దాస్ - ఫోన్ నెంబరు. 9154882126.
- తాడికొండ, మంగళగిరి, పొన్నూరు, తెనాలి అసెంబ్లీ నియోజకవర్గాల వ్యయ పరిశీలకుడు రాధానాథ్ పురోహిత్ - ఫోన్ నెంబరు. 9154882131
- ప్రత్తిపాడు, గుంటూరు తూర్పు, గుంటూరు పశ్చిమ నియోజకవర్గాల వ్యయ పరిశీలకులు యెర్నే వినోద్‌కుమార్ - ఫోన్ నెంబరు. 9154882129

అంబటి మురళీపై కేసు నమోదుకు ఆదేశం

పొన్నూరుటౌన్, ఏప్రిల్ 17: పొన్నూరు వైసీపీ అభ్యర్థి అంబటి మురళీకృష్ణపై కేసు నమోదు చేయాలని ఎన్నికల సంఘం గురువారం ఆదేశించింది. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన తర్వాత మురళీకృష్ణ పొన్నూరు మండలం మాచవరంలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ చేశారు. దీనిపై చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు నియోజకవర్గ ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేశారు. అయితే ఆ అధికారి వివరణతో సరిపెట్టడంతో టీడీపీ నాయకులు రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించారు. ఈ క్రమంలో ఆయనపై ఆరోపణలు నిర్ధారణ కావడంతో ఎన్నికల చట్ట ప్రకారం కేసు నమోదు చేయాలని ఏపీ ఎన్నికల కమిషన్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే అంబటి మురళీకృష్ణపై కోడ్ ఉల్లంఘన కింద కేసులు నమోదవటంతోపాటు, పలు ఫిర్యాదులు విచారణలో ఉన్నాయి. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నాడే వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. దాంతో 101 మంది వలంటీర్లను అధికారులు విధుల నుంచి తొలగించారు.

సందట్లో సడేమియా!

- ప్రచారానికి ప్యాకేజీలు

మండు వేసవిలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో.. ప్రధాన పార్టీల అభ్యర్థులు విజయమే లక్ష్యంగా ఇప్పటికే ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. డబ్బును మంచినీళ్లల్లా ఖర్చు పెడుతున్నారు. మరో మూడు వారాలు పాటు అభ్యర్థులకు ఈ పరిస్థితి తప్పేలా లేదు. ఇదే అవకాశంగా కొందరు సందట్లో సడేమియాలు రంగంలోకి దిగారు. పలు పార్టీల అభ్యర్థులను కలసి థర్డ్ పార్టీ ఏజెన్సీ కింద ఇన్‌స్టెంట్ ప్రచార బాధ్యతలు తాము నిర్వహిస్తామని కొత్త వ్యాపార కిటుకులు చెబుతున్నారు. దీనికి పలు ప్యాకేజీలు పెట్టారు. .రూ.3 లక్షలకు అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రతి ఇంటికి ఆ అభ్యర్థి ప్రచార కరపత్రాలు పంపిణీ చేస్తామని, రూ.5 లక్షలు ఇస్తే పలు యూట్యూబ్ ఛానల్ ద్వారా అభ్యర్థి ఎన్నికల ప్రచార ప్రకటనలు, ఇంటర్వ్యూలు ప్రసారం చేయిస్తామంటున్నారు. నేరుగా అభ్యర్థి వెంట ప్రచారంలో జనాలు పాల్గొనాలంటే ఒక్కో కార్యకర్తకు రోజుకు రూ.వెయ్యి చెల్లించాలని, భోజనం, టిఫిన్‌కు అదనపు చెల్లింపులు ఉంటాయని చెబుతున్నారు. రోజుకు ఎంత మందిని కావాలంటే అంత మందిని సమకూరుస్తామని, ముందుగా కొంత అడ్వాన్స్ చేతిలో పడేయమని ఒత్తిడి తెస్తున్నారు. తమది భలే మంచి చౌక బేరమంటున్నారు. వీరు చెబుతున్న ప్యాకేజీలకు అభ్యర్థులకు పట్టపగలే చుక్కలు కనిపిస్తున్నాయి. ఇక కొన్ని కుల సంఘాలు కూడా ఇదే అదనుగా భావించి రంగంలోకి దిగాయి. అధికార పార్టీ అభ్యర్థులను, సిటింగ్ ఎమ్మెల్యేలను వీరు లక్ష్యంగా చేసుకొని.. తమ సంఘం మీకే పూర్తి మద్దతు ఇస్తుందని, ఏదో మీకు తోచింది మా సంఘానికి ఫండింగ్ ఇవ్వాలని ఒత్తిడి తెస్తూ దొరికినకాడికి అందిపుచ్చుకుంటున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఈ దందా జోరుగా సాగుతోంది.

- గుంటూరు

బరిలోకి.. తొలిసారి

- ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి 10 మంది రంగంలోకి

గుంటూరు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): రాజకీయ చైతన్యం కలిగిన ఉమ్మడి గుంటూరు జిల్లా కొత్త తరం నాయకులకు వేదికగా మారింది. ప్రధాన రాజకీయ పార్టీలైన తెలుగుదేశం, వైసీపీలు రాజకీయ ఎత్తుగడలతో కొత్త వారికి అవకాశం కల్పించాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో మొత్తం 10 మంది కొత్త అభ్యర్థులు ఈ సారి ఎన్నికల బరిలో నిలిచేందుకు ప్రధాన పార్టీలు అవకాశం కల్పించాయి. వారిలో గుంటూరు తూర్పు నుండి నూరి ఫాతిమా బరిలోకి దిగి ప్రచారం నిర్వహిస్తున్నారు. ఆమె తన తండ్రి, సిట్టింగ్ ఎమ్మెల్యే ముస్తఫాకు వారసురాలిగా వైసీపీ అభ్యర్థిగా రంగప్రవేశం చేసింది. గుంటూరు పశ్చిమ నుంచి గళ్లా మాధవి అనూహ్యంగా బరిలోకి దిగారు. ఆమె కుటుంబానికి ఎటువంటి రాజకీయ నేపథ్యం లేకపోయినప్పటికీ కుల సమీకరణలో భాగంగా ఆమె అభ్యర్థిత్వాన్ని చంద్రబాబునాయుడు ఖరారు చేశారు. కమ్మ సామాజికవర్గం వారు ఈ సీటుపై ఎన్నో ఆశలు పెట్టుకున్నప్పటికీ ఇదే నియోజకవర్గం నుంచి వైసీపీ తరపున బీసీ సామాజికవర్గానికి చెందిన మంత్రి విడదల రజినీ బరిలోకి దిగటంతో టీడీపీ కూడా బీసీ సామాజికవర్గ మహిళనే ఎంపిక చేసింది. పెదకూరపాడు నుంచి భాష్యం ప్రవీణ్ యువత కోటాలో టీడీపీ టికెట్ దక్కించుకున్నాడు. మంగళగిరి నుండి వైసీపీ అభ్యర్థిగా మాజీ మంత్రి మురుగుడు హనుమంతరావు కోడలు మురుగుడు లావణ్య ఎన్నికల బరిలోకి దిగారు. టీడీపీ అభ్యర్థి, యువనేత నారా లోకేశ్‌ను ఆమె ఢీకొంటున్నారు. ప్రత్తిపాడు నుంచి వైసీపీ అభ్యర్థి స్థానికేతరుడైన బలసాని కిరణ్ కుమార్ బరిలోకి దిగారు. పొన్నూరు నుంచి మంత్రి అంబటి రాంబాబు సోదరుడు అంబటి మురళీకృష్ణ వైసీపీ అభ్యర్థిగా రంగ ప్రవేశం చేశారు. సిట్టింగ్ ఎమ్మెల్యే కిలారి రోశయ్యను గుంటూరు ఎంపీ అభ్యర్థిగా పంపటంతో మురళీకి అవకాశం దక్కింది. చిలకలూరిపేట నుంచి గుంటూరు నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు వైసీపీ అభ్యర్థిగా రంగప్రవేశం చేశారు. బాపట్ల నుంచి వేగేశన నరేంద్రవర్మ టీడీపీ అభ్యర్థిగా తొలిసారి ఎన్నికల బరిలోకి దిగారు. ఈ ఐదేళ్ళుగా ఆయన ఆ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరిస్తూ వచ్చారు. రేపల్లె నుంచి వైసీపీ అభ్యర్థిగా ఈవూరి గణేశ్‌ను బరిలోకి దింపారు. ఈ నియోజకవర్గంపై ఆధిపత్యం చెలాయిస్తున్న మోపిదేవి కుటుంబానికి గండి కొట్టి ఇతనికి అవకాశం కల్పించారు. వేమూరు నుంచి వైసీపీ అభ్యర్థిగా వరికూటి అశోక్‌కుమార్ తొలిసారి ఎన్నికల బరిలోకి దిగుతున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మంగళగిరి, ఏప్రిల్ 18: విద్యుత్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా శుక్రవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు డీఈఈ అక్కల సత్యనారాయణ తెలిపారు. గౌతమబుద్ధ రోడ్డు పడమర వైపు భగత్ సింగ్ నగర్, ఈద్గా, గ్యాస్ కంపెనీ రోడ్డు, రైల్వేస్టేషన్ రోడ్డు, పార్కు రోడ్డు, నిడమర్రు రోడ్డు ప్రాంతాల్లో ఉదయం 6 నుంచి 9 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

షిరిడి సాయి బాబా మందిర వార్షికోత్సవం

తుళ్లూరు,ఏప్రిల్ 18: తుళ్లూరులోని భగవాన్ షిరిడి సాయిబాబా మందిర వార్షిక వేడుకలు గురువారం ప్రారంభమయ్యాయి. ఉదయం 5 గంటల నుంచి అఖండ సాయి నామ సంకీర్తన ప్రారంభమైంది. శుక్రవారం తెల్లవారు జామున 5 గంటల వరకు పారాయణం జరుగుతుంది. మధ్యాహ్నం హనుమాన్ చాలీసా పారాయణం జరుగు తుందని భక్త కమిటి పేర్కొంది. భక్తులకు అన్నదాన కార్యక్రమం జరుగుందన్నారు.

గురువారం వైభవంగా సాయిబాబా వారి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులకు హారతులు ఇచ్చారు.

ఇలా అయితే చెరువులు ఎలా నిండుతాయి..

- 20శాతమే నిండిన తాగునీటి చెరువులు
- నిలిచిపోనున్న సాగర్ జలాలు
- చెరువులు నింపేందుకు అధికారుల పాట్లు
- మరో వారం రోజులు అదనంగా నీరు విడుదల చేయాలని కోరుతున్న ప్రజలు

పెదనందిపాడు, ఏప్రిల్ 18: ఈ ప్రాంతం సాగర్ ఆయకట్టు చివరి భూములు కావడంతో ప్రభుత్వం ఈ నెల 8న విడుదల చేసిన తాగునీరు ఇక్కడికి చేరేందుకు వారం రోజులు పట్టింది. అలా వచ్చాయో లేదో నీరు ఆడుగంటడంతో అధికారులు ప్రజాప్రతినిధులు నానా అవస్థలు పడుతున్నారు. ఇప్పటికే చెరువులు నింపేందుకు కాలువలపై పదుల సంఖ్యలో ఇంజన్లు ఏర్పాటు చేసినప్పటికీ కాలువల్లో సక్రమంగా నీరు సరఫరా అవ్వకపోవడంతో గంటలకొద్దీ ఇంజన్లు నిలిపివేయాల్సి వస్తుందని వాపోతున్నారు. గ్రామాల్లో చెరువుల్లోకి 15 శాతం కూడా నీరు చేరలేదని, వచ్చిన నీరు నెలకు మాత్రమే సరిపోతాయని, తరువాత ఏమి చేయాలం టూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం మరో వారం రోజులపాటు కాలువల ద్వారా నీరు విడుదల చేయాలని ప్రజలు కోరుతున్నారు.



తక్కువగా నీరు పారుతున్న సాగర్ కాలువ



తాగునీటి చెరువులు పరిశీలిస్తున్న ఎంపీడీవో సునీతాశర్మ

తాగునీటి చెరువుల పరిశీలన

పెదనందిపాడు మండల పరిధిలోని పుసులూరు, పమిడివారిపాలెంలో గురువారం తాగునీటి చెరువులను ఎంపీడీవో సునీతాశర్మం పరిశీలించారు. అధికారులు ప్రజాప్రతినిధుల సహకాంతో కాలువల్లో వస్తున్న నీటిని ఇంజన్ల ద్వారా చెరువులు నింపాలని, వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో చెరువులు పూర్తిస్థాయిలో నింపుకోవాలని సూచించారు. తాగునీరు క్లోరినేషన్ చేసి గ్రామాల్లోకి నీరు విడుదల చేయాలని తెలిపారు. ఆమె వెంట ఈవోపీఆర్డీ సాయిలీల, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సీహెచ్ రాజేష్ ఉన్నారు.

నారా లోకేశ్ నామినేషన్‌కు భారీగా తరలిన టీడీపీ శ్రేణులు

- ద్విచక్ర వాహనాలపై ర్యాలీగా వెళ్లిన పార్టీ కార్యకర్తలు

దుగ్గిరాల, ఏప్రిల్ 18: మంగళగిరి అసెంబ్లీ టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న నారా లోకేశ్ నామినేషన్ కార్యక్రమంలో పాల్గొనేందుకు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. దుగ్గిరాల నుంచి మంగళగిరి బయలుదేరిన కార్యకర్తల వాహనాలకు టీడీపీ వాణిజ్య విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గూడూరు వెంకట్రావు పార్టీజెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. గద్దె శ్రీనివాస్, లంకా ఫణిబ్రదర్స్, వల్లూరు నరసింహారావు, కాకా బాబు, నక్కా చిరంజీవి, గార్లపాటి చిన్నా, బాలాజీ, హనుమానాయక్, ఎద్దు ప్రసాద్, కిషోర్, శంకర్, లియాఖత్, ఏడు కొండలు, పరమయ్య, నరేంద్ర పలువురు తెలుగుయువత పాల్గొన్నారు. టీడీపీ మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత, తాళ్ల అశోక్, దేవరపల్లి చంటి, తోటకూర సీతారామయ్య, పినపాటి కరుణాకర్, జలాలుద్దీన్, సాదిక్, వాసిరెడ్డి శ్రీనివాసరావు, కొప్పుల మధు, పలువురు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పలు ద్విచక్ర వాహనాలపై తరలివెళ్లారు. ఈమని, రేవేంద్రపాడు, పెనుమూలి, కేఆర్‌కొండూరు, శృంగార పురం, పెదపాలెం, పెదకొండూరు, మోరంపూడి, మంచికలపూడి, చిలువూరు, తుమ్మపూడి తదితర గ్రామాల నుంచి స్వచ్ఛందంగా పలువురు టీడీపీ నాయ కులు, కార్యకర్తలు ఎంతో ఉత్సా హంగా లోకేశ్ నామినేషన్‌కు తరలివెళ్లారు.



చిలువూరులో జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న గ్రామ టీడీపీ నాయకుడు తోటకూర సీతారామయ్య

తాడేపల్లిలో శానిటేషన్‌పై సమీక్ష

తాడేపల్లి టౌన్, ఏప్రిల్ 18: ఎంటీఎంసీ పరిధిలో శానిటేషన్‌పై కమిషనర్ నిర్మల్‌కుమార్ గురువారం సమీక్ష తాడేపల్లిజోన్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ తాడేపల్లి నగరపాలక సంస్థ స్వచ్ఛత సాకారం చేసే దిశగా కార్యక్రమాలు నిబద్ధ తతో నిర్వహించాలని, నగరంలోని అన్ని రహదారులు, డ్రెయిన్లు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. నగరంలో డోర్ కలెక్షన్, తడి చెత్త, పొడి చెత్త గురిం చి ప్రజల్లో పూర్తి అవగాహన కల్పించి నగర శుభ్రత పరిరక్షణలో ప్రజలను భాగస్వాములను చేయాలని తెలి పారు. సచివాలయాల పరిధిలోని ఖాళీ స్థలాలను గురించి, యజమానులకు నోటీసులు జారీ చేసి జంగిల్ క్లియరెన్స్ చేసుకునే విధంగా చుట్టు పక్కల ప్రాంత ప్రజలు ఖాళీ స్థలాల్లో చెత్త వేయకుండా చూసే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సంబంధిత ప్రాంతాల్లో ఫాగింగ్‌ను సక్రమంగా నిర్వహించి, దోమల వల్ల వచ్చే వ్యాధుల నియంత్రణ చేయాలని కోరారు. అందరు క్రమశిక్షణతో పని చేయాలని విధి నిర్వహణలో అలసత్వం, నిర్లక్ష్యం ఉండకూడదని సూచించారు. కార్యనిర్వహణలో ఏమైనా సమస్యలు వస్తే వాటిని కార్పొరేషన్ దృష్టికి తీసుకుని రావాలని సమస్యల పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో వార్డు శానిటేషన్ సెక్రటరీలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి శ్రీరామరక్ష సూపర్-6 పథకాలు

- కూటమి అభ్యర్థి రామాంజనేయులు

ప్రత్తిపాడు, ఏప్రిల్ 18: ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా ఇవ్వడంతో పాటు అన్ని విధాలా ఆదుకునేందుకు నారా చంద్రబాబునాయుడు సూపర్-6 పథకాలను రూపొందించారని, అవి మనకు శ్రీరామరక్షగా నిలుస్తాయని ప్రత్తిపాడు కూటమి అభ్యర్థి బీ రామాంజనేయులు అన్నారు. ప్రత్తిపాడు మండల పరిధిలోని ప్రత్తిపాడు, పాతమల్లాయపాలెం, కొత్తమల్లాయపాలెం గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రతిఒక్కరికి కరపత్రాలు అందజేస్తూ తెలుగుదేశం పార్టీ విధివిధానాలను తెలియజేస్తూ ముందుకు సాగారు. అన్ని గ్రామాల్లో రామాంజనేయులుకు స్థానికులు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమాల్లో తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.



పాతమల్లాయపాలెంలో కూటమి అభ్యర్థి రామాంజనేయులుకు హారతులు ఇస్తున్న మహిళలు

నేడు కూటమి అభ్యర్థి శ్రావణ్‌కుమార్ నామినేషన్

తాడికొండ, ఏప్రిల్ 18: తెలుగుదేశం, బీజేపీ, జనసేన పార్టీల ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి తెనాలి శ్రావణ్‌కుమార్ శుక్రవారం ఉదయం 10.15 గంటలకు నామినేషన్‌ను దాఖలు చేయనున్నారు. తెనాలి శ్రావణ్‌కుమార్ ఎమ్మెల్యే అభ్యర్థిగా నాలుగోసారి నామినేషన్ వేస్తున్నారు. 2009, 2014, 2019లో తాడికొండ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా శ్రావణ్‌కుమార్ నామినేషన్ దాఖలు చేశారు. ఉదయం 9 గంటలకు తాడికొండ అడ్డరోడ్డు సెంటర్ నుంచి ర్యాలీగా వచ్చి ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆర్‌వో కార్యాలయంలో నామినేషన్ పత్రాలను సమర్పించనున్నారు. ఈ కార్యక్రమాన్ని టీడీపీ, జనసేన, బీజేపీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పార్టీ కార్యాలయం పేర్కొన్నది.

క్రీడా పోటీల్లో ఎన్నారై విద్యార్థినుల ప్రతిభ



పతకాలు సాధించిన ఎన్నారై విద్యార్థినులతో విష్ణువర్ధన్‌రావు తదితరులు

మంగళగిరి, ఏప్రిల్ 18: వైఎస్ఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఆశ్రమ్ మెడికల్ కళాశాలలో నిర్వహించిన అంతర్ కళాశాలల వైద్య విద్యార్థుల క్రీడా పోటీల్లో మంగళగిరి ఎన్నారై విద్యార్థినులు ఉత్తమ ప్రతిభ కనబర్చారు. టెన్నిస్, బాస్కెట్ బాల్ పోటీల్లో రజత పతకం, వాలీబాల్, టేబుల్ టెన్నిస్‌లో కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారని ఎన్నారై వ్యాయామ ఉపాధ్యాయుడు గురునాథం తెలిపారు. పతకాలు సాధించిన విద్యార్థులను ఎన్నారై అడ్మినిస్ట్రేటర్ మండవ విష్ణువర్ధన్‌రావు గురువారం అభినందించి రూ.రెండు లక్షల నగదు పారితోషకాన్ని ప్రకటించారు. కార్యక్రమంలో ఎన్నారై డీన్ డాక్టర్ లక్ష్మీ, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసరావు, ఎగ్జిక్యూటివ్ సెక్రెటరీ వెంకటేశ్వరరావు, అసిస్టెంట్ ఫిజికల్ డైరెక్టర్ ఏడుకొండలు, సిబ్బంది పాల్గొన్నారు.

463 బస్తాల పసుపు విక్రయం

దుగ్గిరాల, ఏప్రిల్ 18: స్థానిక పసుపు మార్కెట్‌యార్డులో గురువారం జరిగిన వేలంలో 463 బస్తాల పసుపును రైతులు వ్యాపారులకు విక్రయించారు. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ.11,850 గరిష్ఠ ధర రూ.13,675 మోడల్‌ధర రూ.13,500 పలికాయి. కాయ క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ. 10,500 గరిష్ఠధర రూ.13,775, మోడల్ ధర రూ.13,300 పలికాయి.

మద్యం విక్రయదారుడు అరెస్టు

పెదనందిపాడు, ఏప్రిల్ 18: అక్రమంగా మద్యం తరలిస్తున్న ఓ వ్యక్తిని గురువారం స్థానిక పాతబస్టాండ్ సెంటర్లో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బాపట్ల జిల్లా పర్చూరు మండలం బోడవాడకు చెందిన శీలం శ్రీనివాసరావు పెదనందిపాడు నుంచి పర్చూరు వైపు 27 క్వాటర్ బాటిళ్ళు తీసుకొని వెళ్తుండగా పట్టుబడ్డాడు. మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాజ్‌కుమార్ తెలిపారు.



ఆర్టీసీ బస్సులో ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ శేషన్న, అసిస్టెంట్ కమిషనర్ అనూష, డిపో మేనేజర్ రాజశేఖర్ తదితరులు

యువత ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

● మున్సిపల్ కమిషనర్ శేషన్న

తెనాలి, మారీసుపేట ఏప్రిల్ 18: రానున్న సార్వత్రిక ఎన్నికలలో యువత తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోవాలని మున్సిపల్ కమిషనర్ బి శేషన్న పిలుపు నిచ్చారు. స్థానిక ఏపీఎస్ ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో గురువారం జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో స్వీప్ (ఎస్వీఇఇపీ)లో భాగంగా యువత, ప్రజలకు మున్సిపల్ కమిషనర్ బి.శేషన్న ఓటు వినియోగంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ శేషన్న మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలలో యువతరం తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని అన్నారు. ప్రజలు స్వేచ్ఛగా ఎటువంటి ప్రలోభాలకు లోను కాకుండా మంచి నాయకత్వాన్ని ఎన్నుకోవాలని కోరారు. ఓటు హక్కును వినియోగించుకొని తద్వారా దేశాభివృద్ధికి, రాష్ట్రాభివృద్ధికి కృషిచేసే అభ్యర్థులను ఎన్నుకోవాలని అన్నారు. అనంతరం ఆర్టీసీ కార్మికులు, ప్రయాణికులతో ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ అనూష, డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్, అసిస్టెంట్ సిటీప్లానర్లు జడ్ సుధాకర్, ఎస్ఎల్ సుబ్బారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఏ రామచంద్రరావు, డి.శ్రీనివాసరావు, మున్సిపల్ అధికారులు, ఆర్టీసీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పెన్షనర్ల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మనోహర్

కూటమి అభ్యర్థి మనోహర్‌కు పెన్షనర్ల మద్దతు

తెనాలి అర్బన్, ఏప్రిల్ 18: టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి అసెంబ్లీ అభ్యర్థి నాదెండ్ల మనోహర్‌కు అమరావతి పెన్షనర్ల అసోసియేషన్ మద్దతు తెలిపింది. చంద్రబాబు గెలుపు-పెన్షనర్ల పిలుపు పేరుతో రూపొందించిన కరపత్రాలను గురువారం ఆయన విడుదల చేశారు. విభజన అనంతరం ఏ దిక్కులేని రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నడిపించారని, ఆ తరువాత వచ్చిన ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో సంక్షోభం తలెత్తిందని మనోహర్ చెప్పారు. పెన్షనర్ల దుస్థితిని వివరిస్తూ అందరూ ఆనందంగా ఉండాలంటే ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. సంఘ నాయకులు గురవయ్య, పూర్ణచంద్రరావు, నాగరాజు, విజడమ్ చౌదరి, మాచిరాజు రామకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

లోకేశ్ సమక్షంలో టీడీపీలోకి ఉస్మాన్ బాషా

పెదకాకాని, ఏప్రిల్ 18 : తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ సమక్షంలో పెదకాకాని మాజీ వార్డు సభ్యుడు షేక్ ఉస్మాన్ బాషా గురువారం పార్టీలో చేరారు. ఈ మేరకు లోకేశ్ బాషాకు పార్టీ కండువా వేసి ఆహ్వానించారు.



బాషాను పార్టీలోకి ఆహ్వానిస్తున్న లోకేశ్

ఆటోనగర్ అభివృద్ధికి ప్రణాళిక రూపొందిస్తాం

● నైపుణ్యాల శిక్షణ అందిస్తాం ● అవినీతిని రూపుమాపుతాం ● ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు పెమ్మసాని, నాదెండ్ల



ఆటోనగర్ అభివృద్ధిపై ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతున్న కూటమి అభ్యర్థి మనోహర్, పాల్గొన్న పారిశ్రామికవేత్తలు

తెనాలి అర్బన్, ఏప్రిల్ 18: ఆటోనగర్ అభివృద్ధికి ప్రణాళిక రూపొందించి అమలు చేస్తామని, నైపుణ్య శిక్షణ ఇవ్వడంతో పాటు కేంద్రప్రభుత్వ రుణాలతో మరిన్ని సంస్థల స్థాపనకు చేయూతనిస్తామని, అవినీతి రూపుమాపుతామని గుంటూరు లోక్‌సభ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఆటోనగర్ అసోసియేషన్‌తో గురువారం సమావేశం నిర్వహించారు. గత ప్రభుత్వ హయాంలో రూ.1500 ఉన్న గ్రీన్ టాక్స్ రూ.20 వేలకు చేరడం ఎంతో భారమని, ఈ టాక్స్‌ను తగ్గించేందుకు కృషి చేయడంతో పాటు బ్రేక్‌ఇన్‌స్పెక్టర్ల వేధింపులు అరికడతామని, అలాగే అవినీతి లేకుండా చూస్తామన్నారు. రాష్ట్రంలో అధ్వానంగా ఉన్న రహదారుల కారణంగా వాహనాలు దెబ్బతింటూ ఆ భారం పరిశ్రమల మీద పడుతుందన్నారు. తెనాలి-విజయవాడ మార్గం అభివృద్ధి చేస్తామని, ఆటోనగర్‌లో సౌకర్యాలపై దృష్టి పెడతామన్నారు. ముంబై లాంటి పెద్ద నగరాల నుంచి నిపుణులను రప్పించి నైపుణ్య శిక్షణ ఇవ్వడంతో పాటు కేంద్ర ప్రభుత్వ రుణాలు ఇప్పించి ఆటోనగర్‌లో మరిన్ని సంస్థలు స్థాపించేందుకు దోహదపడతామని చెప్పారు. నియోజకవర్గ అసెంబ్లీ కూటమి అభ్యర్థి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ, 1989లో తన తండ్రి ఆటోనగర్ ఏర్పాటుకు కృషి చేశారని చెప్పారు. ఆటోనగర్‌లో సోలార్ పథకాన్ని అమలు చేసి విద్యుత్ ఖర్చులు లేకుండా చూస్తామని, ఎంతో మందికి ఉపాధి అందిస్తున్న ఈ ప్రాంతాన్ని మరింతగా అభివృద్ధి చేస్తామన్నారు. కొత్త టెక్నాలజీని అందిపుచ్చుకునేలా చర్యలు చేపడతామని, పవన్ కళ్యాణ్, చంద్రబాబు నాయుడు ఆలోచనలతో ఏపీ ఇండస్ట్రియల్ కారిడార్‌గా రూపుదిద్దుకుంటే ఆటోనగర్‌కు మరింత ఆదాయం వస్తుందన్నారు. అభివృద్ధికి దోహదపడే తమకు మద్దతు ఇవ్వాలని కోరారు.

కార్యక్రమంలో అసోసియేషన్ ఛైర్మన్ చుక్కపల్లి శివనాగేశ్వరరావు, అన్నాబత్తుని జయలక్ష్మి, తోటకూర వెంకటరమణరావు తదితరులు పాల్గొన్నారు.

పొన్నూరు ప్రగతికి చిత్తశుద్ధితో పాటుపడతాం

● 6, 24వ వార్డుల్లో ఇంటింటి ప్రచారంలలో ధూళిపాళ్ల



6వ వార్డులో పర్యటిస్తున్న నరేంద్రకుమార్ తదితరులు

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 18: పొన్నూరు ప్రగతికి చిత్తశుద్ధితో పాటుపడతామని మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ హామీ ఇచ్చారు. పట్టణంలోని 6, 24వ వార్డుల్లో గురువారం నరేంద్రకుమార్ ఎన్నికల ప్రచారం నిర్వహించి సూపర్ -6 పథకాల గురించి ప్రజలకు వివరించారు. వార్డులో ఇంటింటికి వెళ్లిన నరేంద్రకుమార్‌కు ప్రజలు ఘన స్వాగతం పలికారు. మహిళలు మంగళహారతులు పట్టి వార్డులోకి తోడ్కొని వెళ్లారు. ఈ సందర్భంగా పలువురు ప్రజలు స్థానిక సమస్యలు పరిష్కరించాలని కోరారు. నరేంద్రకుమార్ మాట్లాడుతూ వైసీపీ పాలకులు పొన్నూరు ప్రగతిని పూర్తిగా విస్మరించారని ఆరోపించారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో తప్ప జరిగిన అభివృద్ధి ఏమిటో చూపించాలని కోరారు. పొన్నూరు అభివృద్ధిపై అసత్యాలు ప్రచారం చేస్తూ ఐదేళ్ల కాలయాపన చేశారని ఆరోపించారు. రానున్న రోజుల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రజల తాగునీటి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వార్డులో ప్రజలు చెబుతున్న సమస్యలు పాలకుల వైఫల్యమేనన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని చెప్పి అడ్డగోలు నిబంధనలు విధించి ప్రజలను పథకాలకు దూరం చేశారని ఆరోపించారు. పురపాలక సంఘంలో అవినీతి అక్రమాలు నెలకొన్నాయన్నారు. ప్రతిపనికి ఒక రేటు నిర్ణయించి అధికారులు, పాలకులు కలిసి ప్రజలను దోచుకుతిన్నారని ధ్వజమెత్తారు. రానున్న రోజుల్లో ప్రజా సమస్యలు అన్ని పరిష్కరించి ప్రజలకు సుపరిపాలన అందిస్తామని హామీ ఇచ్చారు. ప్రజలు రెండు ప్రభుత్వాల మధ్య వ్యత్యాసాలను గుర్తించి కూటమి పార్టీలకు అండగా నిల్చి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ పర్యటనలో టీడీపీ, జనసేన నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ముస్లిం కుటుంబాలకు వివాహ కానుకలు పంపిణీ

తెనాలి అర్బన్, ఏప్రిల్ 18: డాక్టర్ జాఫర్ సాదిక్ బాషా మైనారిటీ వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేద ముస్లిం కుటుంబాలకు వివాహ కానుకలు పంపిణీ చేశారు. 18మందికి రూ.8 లక్షలు విలువైన గృహోపకరణాలను మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ చేతుల మీదుగా గురువారం అందజేశారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతిఏటా అందిస్తున్న ఈ కార్యక్రమం అభినందనీయమన్నారు.

కార్యక్రమంలో డాక్టర్ సాదిక్ బాషా, మహ్మద్ ఖుద్దూస్, తాడిబోయిన హరిప్రసాద్, షేక్ అబ్బాస్, షేక్ అన్వర్, మొహీద్దీన్, నాజర్, షేక్ ఖలీల్, రమ్య, రవికుమార్, గౌసియాబేగం పాల్గొన్నారు.



గృహోపకరణాలు పంపిణీ చేస్తున్న మాజీ మంత్రి ఆలపాటి తదితరులు

మంగళగిరిలో తొలిరోజు 14 నామినేషన్లు



మంగళగిరిలో సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్‌ను విడుదల చేస్తున్న ఆర్వో రాజకుమారి

మంగళగిరి, ఏప్రిల్ 18: సార్వత్రిక ఎన్నికల సమరం మొదలైంది. గురువారం నోటిఫికేషన్ వెలువడిన వెంటనే నామినేషన్ల ఘట్టం ఆరంభమైంది. మంగళగిరి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజకుమారి గురువారం ఉదయం సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేశారు. అనంతరం నామినేషన్ల ప్రక్రియ ఆరంభం కాగా... మంగళగిరి అసెంబ్లీ స్థానానికి సంబంధించి తొలిరోజు పది మంది అభ్యర్థుల నుంచి 14 నామినేషన్లు దాఖలయ్యా యి. టీడీపీ అభ్యర్థి నారా లోకేశ్ తరపున ఎన్డీఏ కూటమి నేతలు నందం అబద్దయ్య ఒక సెట్, వేమూరి మైనర్‌బాబు మరో సెట్, నవతరం పార్టీ తరపున రావు సుబ్రహ్మణ్యం రెండు సెట్లు, నవరంగ్ కాంగ్రెస్ పార్టీ తరపున షేక్ జలీల్, స్వతంత్ర అభ్యర్థి దానబోయిన వెంకట శివాజీ మూడు సెట్లు, భారత చైతన్య యువజన పార్టీ తరపున బోడె రామచంద్ర యాదవ్, స్వతంత్ర అభ్యర్థి బండ్ల బిక్షమయ్య, స్వతంత్ర అభ్యర్థిగా నైనాల లావణ్య, జైభీమ్‌రావు భారత్ పార్టీ తరపున జడ శ్రావణ్‌కుమార్, తెలుగు రాజ్యాధికార సమితి పార్టీ తరపున జంజనం కోటేశ్వరరావు, స్వతంత్ర అభ్యర్థిగా జంజనం పద్మ నామినేషన్లు దాఖలు చేశారు.

మొదటి రోజు ఒక నామినేషన్

తాడికొండ, ఏప్రిల్ 18: తాడికొండలో నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైనది. గురు వారం ఉదయం 11గంటలకు ఎమ్మెల్యే అభ్య ర్థిగా తొలిరోజు పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండి యాకు చెందిన తాళ్లూరి నాగరాజు మొదటి నామినేషన్‌ను ఎన్నికల రిటర్నింగ్ అధికారికి సమర్పించారు.

ప్రత్తిపాడులో ఒకటి

ప్రత్తిపాడు, ఏప్రిల్ 18: ప్రత్తిపాడు అసెంబ్లీకి సంబంధించి తొలి రోజు ఒక నామినేషన్ దాఖలైనట్లు ఆర్వో శ్రీకర్ తెలిపారు. భారత చైతన్య యువజన పార్టీకి సంబంధించి అభ్యర్థిగా సంకూరు స్తోత్ర రాణి నామినేషన్ దాఖలు చేశారు.

నరేంద్రపై చేసిన ఆరోపణలు నిరూపించాలి: టీడీపీ నాయకుల డిమాండ్

కాకుమాను, ఏప్రిల్ 18: పొన్నూరు మాజీ ఎమ్మెల్యే, సంగండెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్‌పై జగన్ పత్రిక చేసిన ఆరోపణలు నిరూపించాలని సంగం డెయిరీ మాజీ ఛైర్మన్ కొల్లా వీరయ్యచౌదరి, పొన్నూరు మాజీ ఏఎంసీ మాజీ ఛైర్మన్, కాకుమాను మాజీ ఎంపీపీ మామిళ్లపల్లి రాంగోపాల్ డిమాండ్ చేశారు. కాకుమాను మండల పార్టీ కార్యాలయంలో గురువారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. జగన్ పత్రికలో టీడీపీ సీనియర్ నాయకుడు, రాజకీయాల్లో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న నరేంద్రకుమార్‌పై సంగం ఆస్తులు స్వాహా చేశారని కథనాలు ప్రచురించడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే సంగంలో భారీ స్థాయిలో అవకతవకలకు నరేంద్ర కారణమని ప్రచురించడం సబబు కాదని అన్నారు. డీవీసీ హాస్పిటల్ నిర్మాణంపై కూడా తప్పుపట్టడం వారి దృతరాష్ట్ర దృష్టికి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో టీడీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కల అగస్టీన్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

463 బస్తాల పసుపు విక్రయం

దుగ్గిరాల, ఏప్రిల్ 18: స్థానిక పసుపు మార్కెట్ యార్డులో గురువారం జరిగిన వేలంలో 463 బస్తాల పసుపును రైతులు వ్యాపారులకు విక్రయించారు. కొమ్ములు క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ.11,850 గరిష్ఠ ధర రూ.13,675 మోడల్‌ధర రూ.13,500 పలికాయి. కాయ క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ. 10,500 గరిష్ఠ ధర రూ.13,775, మోడల్ ధర రూ.13,300 పలికాయి.

ఇలా అయితే చెరువులు ఎలా నిండుతాయి..

● 20శాతమే నిండిన తాగునీటి చెరువులు
● నిలిచిపోనున్న సాగర్ జలాలు
● చెరువులు నింపేందుకు అధికారుల పాట్లు
● మరో వారం రోజులు అదనంగా నీరు విడుదల చేయాలని డిమాండ్

పెదనందిపాడు, ఏప్రిల్ 18: ఈ ప్రాంతం సాగర్ ఆయకట్టు చివరి భూములు కావడంతో ప్రభుత్వం ఈ నెల 8న విడుదల చేసిన తాగునీరు ఇక్కడికి చేరేందుకు వారం రోజులు పట్టింది. అలా వచ్చాయో లేదో నీరు అడుగంటడంతో అధికారులు ప్రజాప్రతినిధులు నానా అవస్థలు పడుతున్నారు. ఇప్పటికే చెరువులు నింపేందుకు కాలువల పై పదుల సంఖ్యలో ఇంజన్లు ఏర్పాటు చేసి నప్పటికీ కాలువల్లో సక్రమంగా నీరు సరఫ రా అవ్వకపోవడంతో గంటలకొద్దీ ఇంజన్లు నిలిపివేయాల్సి వస్తుందని వాపోతున్నారు. గ్రామాల్లో చెరువుల్లోకి 15 శాతం కూడా నీరు చేరలేదని, వచ్చిన నీరు నెలకు మాత్రమే సరిపోతాయని, తరువాత ఏమి చేయాలం టూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం మరో వారం రోజులపాటు కాలువల ద్వారా నీరు విడుదల చేయాలని ప్రజలు కోరుతున్నారు.



సాగర్ కాలువలో తక్కువగా పారుతున్న నీరు



తాగునీటి చెరువులు పరిశీలిస్తున్న ఎంపీడీవో సునీతాశర్మ

తాగునీటి చెరువుల పరిశీలన

పెదనందిపాడు మండల పరిధిలోని పుసులూరు, పమిడివారిపాలెంలో గురువారం తాగునీటి చెరువులను ఎంపీడీవో సునీతాశర్మం పరిశీలించా రు. అధికారులు ప్రజాప్రతినిధుల సహకాంతో కాలువల్లో వస్తున్న నీటిని ఇంజన్ల ద్వారా చెరువులు నింపాలని, వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో చెరువులు పూర్తిస్థాయిలో నింపుకోవాలని సూచించారు. తాగునీరు క్లోరినేషన్ చేసి గ్రామాల్లోకి నీరు విడుదల చేయాలని తెలిపారు. ఆమె వెంట ఈవోపీఆర్డీ సాయిలీల, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సీహెచ్ రాజేష్ ఉన్నారు.



కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్

తెనాలిలో తొలిరోజు నామినేషన్లు నిల్

తెనాలి అర్బన్, ఏప్రిల్ 18: తెనాలి నియోజకవర్గ శాసనసభ ఎన్నికలకు తొలిరోజు నామినేషన్లు దాఖలు కాలేదు. సబ్ కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి అయిన ప్రఖర్‌జైన్ గురువారం విలేకరులతో మాట్లాడుతూ, అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. నియోజకవర్గంలో పోలింగ్ స్టేషన్లను తనిఖీచేసిన సమయంలో కొన్నిచోట్ల వాటిని మార్చాల్సిన అవసరం గుర్తించి ఎన్నికల కమిషన్‌కు నివేదించామని, కమిషన్ అనుమతించడంతో వాటిని తగిన ప్రాంతాల్లో ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. నామినేషన్లను ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు దాఖలు చేయవచ్చన్నారు. ఆన్‌లైన్‌లో కూడా నామినేషన్లు దాఖలు చేయవచ్చని తెలిపారు. అభ్యర్థులు నామినేషన్లతో దాఖలు చేయాల్సిన పత్రాలను వివరించే బోర్డును ప్రదర్శించామన్నారు. నామినేషన్ సమయంలో కార్యాలయం వద్ద ప్రదర్శనలకు తగిన బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యాలయ ఆవరణలో హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేశామని అభ్యర్థులకు ఏమైనా అనుమానాలు ఉంటే నివృత్తి చేసుకోవచ్చన్నారు.

పొన్నూరులోనూ...

పొన్నూరుటౌన్, ఏప్రిల్ 18: పొన్నూరు అసెంబ్లీ ఎన్నికలకు తొలి రోజు ఒక నామినేషన్ కూడా దాఖలు కాలేదని నియోజకవర్గ ఎన్నికల అధికారి ఎ.లక్ష్మీ కుమారి గురువారం తెలిపారు. సార్వత్రిక ఎన్నికలకు గురువారం ఎన్నికల సంఘం నోటీకేషన్ జారీ చేసింది. తొలి రోజు నుంచి ఈ నెల 25 వరకు పోటి చేసే అభ్యర్థుల నామినేషన్లు స్వీకరించనున్నారు.



పెట్రోల్ బంక్‌లో మంటలను అదుపు చేసే పద్ధతులు చూపిస్తున్న అధికారులు

పెట్రోల్ బంకుల నిర్వహణపై అప్రమత్తంగా ఉండాలి

● ఫైర్ ఆఫీసర్ కె.ప్రసాదరావు

పొన్నూరు టౌన్, ఏప్రిల్ 18: వేసవి కాలంలో పెట్రోల్ బంకుల నిర్వహణపై అప్రమత్తంగా ఉండి ప్రమాదాలను నివారించుకోవాలని ఫైర్ ఆఫీసర్ కె.ప్రసాదరావు పిలుపునిచ్చారు. పట్టణంలోని హిందుస్థాన్ పెట్రోల్ బంక్‌లో గురువారం అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహించారు. పెట్రోల్ బంకులో జరిగే ప్రమాదాలు మంటలను అదుపు చేసే పద్ధతుల గురించి తెలియజేశారు. అలాగే భారత్‌గ్యాస్ గోడౌన్‌లో అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహించి ప్రమాద పద్ధతుల నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైసీపీని గెలిపించాలి

ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్

కొల్లివర, ఏప్రిల్ 18: రాష్ట్రంలో సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైసీపీ అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. గురువారం మండల పరిధిలోని వల్లభాపురం, దంతలూరు, కుంచవరం అత్తలూరివారిపాలెం గ్రామాల్లో ఎమ్మెల్యే శివకుమార్ స్థానిక నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పరిపాలనలో దేశంలో ఇంతవరకు ఏ ప్రభుత్వం చేయని విధంగా ఎన్నికల మ్యానిఫెస్టోని 95శాతం అమలు చేసినట్లు తెలియజేశారు. ప్రభుత్వంపై ప్రజల్లో మంచి ఆదరణ కనిపిస్తుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా జగన్మోహన్‌రెడ్డిని మరలా ప్రజలు కోరుకుంటున్నట్లు తెలియజేశారు. రోడ్‌షోలో ఎంపీపీ భీమవరపు పద్మావతి, వైసీపీ కన్వీనర్ అవుతు పోతిరెడ్డి, సర్పంచ్ వల్లభాపురం నిర్మలా, నాయకులు ఆరిగ చంద్రశేఖర్‌రెడ్డి, భీమవరపు సంజీవరెడ్డి, అవుతు శేఖర్‌రెడ్డి, వంగా సుధాకర్‌రెడ్డి, అవుతు నగేష్‌రెడ్డి, లంకిరెడ్డి అప్పిరెడ్డి, గుదిబండి రమేష్‌రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీల్లో ఎన్నారై విద్యార్థినుల ప్రతిభ



పతకాలు సాధించిన ఎన్నారై విద్యార్థినులతో విష్ణువర్ధన్‌రావు తదితరులు

మంగళగిరి, ఏప్రిల్ 18: వైఎస్ఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఆశ్రమ్ మెడికల్ కళాశాలలో నిర్వహించిన అంతర్ కళాశాలల వైద్య విద్యా ర్థుల క్రీడా పోటీల్లో మంగళగిరి ఎన్నారై విద్యార్థినులు ఉత్తమ ప్రతిభ కనబర్చా రు. టెన్నిస్, బాస్కెట్ బాల్ పోటీల్లో రజ త పతకం, వాలీబాల్, టేబుల్ టెన్నిస్‌లో కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారని ఎన్నారై వ్యాయామ ఉపాధ్యాయుడు గురునాథం తెలిపారు. పతకాలు సాధిం చిన విద్యార్థులను ఎన్నారై అడ్మినిస్ట్రేటర్ మండవ విష్ణువర్ధన్‌రావు గురువారం అభినందించి రూ.రెండు లక్షల నగదు పారితోషకాన్ని ప్రకటించారు. కార్యక్ర మంలో ఎన్నారై డీన్ డాక్టర్ లక్ష్మీ, మెడి కల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస రావు, ఎగ్జిక్యూటివ్ సెక్రెటరీ వెంకటేశ్వర రావు, అసిస్టెంట్ ఫిజికల్ డైరెక్టర్ ఏడు కొండలు, సిబ్బంది పాల్గొన్నారు.

అమరావతి జేఏసీ ఆధ్వర్యంలో ప్రచారం



పెనుమాకలో ప్రచారం నిర్వహిస్తున్న అమరావతి రైతు మహిళలు

తాడేపల్లి, ఏప్రిల్ 18: మంగళగిరి నియోజకవర్గ పరిధిలోని రాజధాని గ్రామం పెనుమాకలో అమరావతి జేఏసీ ఆధ్వర్యంలో గురువారం ప్రచారం నిర్వహించారు. అమరావతి రైతులు, రైతు మహిళలు, వర్తకులు, దళిత జేఏసీ నాయకులు, ముస్లిం జేఏసీ సమన్వయ కమిటీ సభ్యులు బృందంగా ఏర్పడి ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రాన్ని అభి వృద్ధి చేసే నాయకుడికి, రాష్ట్ర రాజధాని అమరావతిని నిర్మించే నాయకుడికి ఓటెయ్యాలని ప్రజలకు వివరించారు. ఇంటింటికి తిరిగి ప్రచారం చేశారు.